మొండికేసిన గుత్తేదారులపై పోలీసులకు ఫిర్యాదు

పేదల కాలనీలో ప్రశ్నార్థకంగా ఇళ్ల నిర్మాణం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పెదరావూరు పేదల కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయని గుత్తేదారు, మేస్త్రీపై లబ్ధిదారులు తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఓ గుత్తేదారుపై కేసు నమోదు చేసినట్టు తెలిసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ లేఔట్‌లో ఇళ్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు.. డ్వాక్రా రుణం, దశలవారీగా నిర్మాణ బిల్లులు తీసుకుని పనులు చేపట్టలేదని ఇటీవల బాధితులు మంత్రి మనోహర్ దృష్టికి తీసుకెళ్లి కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన సూచన మేరకు వారు పోలీసులను ఆశ్రయించారు.

● గత వైకాపా ప్రభుత్వం ఆప్షన్ 3 కింద ఇళ్ల నిర్మాణం చేపడతామని లబ్ధిదారులను నమ్మించింది. ఈ పనులు గుత్తేదారులకు అప్పగించింది. బిల్లు రూ. 1.80 లక్షలిస్తే పిల్లర్లు లేని ఇల్లు కడతామని చెప్పారు. దీనితోపాటు డ్వాక్రా రుణం రూ. 35 వేలు కూడా ఇస్తే ఐదు పిల్లర్లు, మరో రూ. 50 వేలిస్తే 9 పిల్లర్లతో ఇంటిని పూర్తి చేస్తామని గృహనిర్మాణ అధికారులు చెప్పారు.


పెదరావూరు జగనన్న లేఔట్‌లో వివిధ దశల్లో నిలిచిన పనులు

ఈ పనులు చేపట్టిన గుత్తేదారులు వర్షాలు కురుస్తున్నాయని చెప్పి వివిధ దశల్లో పనులాపేశారు. లబ్ధిదారులు ఎన్నిసార్లు మొత్తుకున్నా కొంతమంది స్పందించలేదు. మరికొంతమంది మొక్కుబడిగా చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తిగా పనులు చేయని గుత్తేదారులపై ఫిర్యాదు చేశారు.

● మొదటి దశలో మంజూరైన 9 వేల ఇళ్లల్లో 7 వేల ఇళ్ల బాధ్యత గుత్తేదారులు తీసుకున్నారు. ఇందులో పనులు అసలు మొదలుకానివి వెయ్యి వరకు ఉన్నాయి. 5,500 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం 17 మంది గుత్తేదారులు నిర్మాణ బాధ్యతలు తీసుకోగా నలుగురు నిలిపేశారు. ఓ మేస్త్రి కొందరు వార్డు సచివాలయాల ఇంజినీర్ల సహకారంతో సుమారు 400 ఇళ్ల నిర్మాణం చేపడతామని చెప్పి లబ్ధిదారుల నుంచి వేలల్లో వసూలు చేశారు. ఇతనిపైనా ఫిర్యాదు చేసేందుకు లబ్ధిదారులు సమాయత్తమవుతున్నారు.

మాయాజాలం



మిర్చి శీతల గోదాముల్లో వరుస అక్రమాలు
బ్యాంకులు, రైతులను మోసం చేస్తున్న వైనం

ఈనాడు – అమరావతి

రైతుల కష్టార్జితాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లు వెనకేసుకుని కర్షకులకు కన్నీటిని మిగుల్చుతున్నారు. ఇలాంటివి తరచూ పునరావృతమవుతున్నా.. మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. అసలు వీరి పర్యవేక్షణ నామమాత్రంగానే ఉండడం అక్రమార్కులకు కలిసివస్తోంది. బ్యాంకులను మోసం చేసి రుణాలు తీసుకోవడం.. రైతుల మిర్చిని విక్రయించి సొమ్ము చేసుకుని, వారికి ఎగ్గొట్టడం కొంతమంది వ్యాపారులకు అలవాటుగా మారిపోయింది.

గురజాలలో శీతల గోదాములో రైతులు మిర్చి నిల్వ చేస్తే.. వీరి పేరుతో రూ. 5 కోట్లకుపైగా బ్యాంకు రుణం తీసుకుని సదరు వ్యాపారి తిరిగి చెల్లించలేదు. అంతేకాదు రైతులు నిల్వ చేసుకున్న మిర్చిని కూడా అమ్మేసి వారికి తీరని వేదన మిగిల్చారు. ఇది మరువకముందే గుంటూరులోని ఓ శీతల గోదాములో మిర్చి నిల్వ చేయకపోయినా... తన పేరుతో రుణం తీసుకున్నట్టు బ్యాంకు నుంచి నోటీసు వచ్చిందంటూ ఓ యువకుడు తెరపైకి వచ్చారు. ఆరా తీస్తే జిల్లాలో అత్యధికంగా ఒక్క శీతల గోదాముకే రుణాలిచ్చినట్టు తేలింది. ఇది విచారణలో ఉండగానే తాజాగా రాఘవేంద్ర శీతలగోదాము వ్యవహారం వెలుగులోకొచ్చింది.

సరకు ఒకటే... రెండు బ్యాంకుల్లో రుణాలు

గుంటూరు నగరంలోని ఓ శీతల గోదాము యజమాని రెండు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న విషయం ఇటీవలే బయటపడింది. మొదట శీతల గోదామును పూచీకత్తుగా చూపించి రూ. 7 కోట్ల రుణం తీసుకుని రూ. 5 కోట్లే చెల్లించారు. ఇదే గోదాములోని సరకు చూపించి రైతుల తరఫున అదే బ్యాంకులో రూ. 17 కోట్ల రుణం తీసుకున్నారు. ఇందులో కొంత మొత్తం తిరిగి చెల్లించారు. మళ్లీ మరో బ్యాంకుకు వెళ్లి అదే సరకు చూపించి సుమారు రూ. 30 కోట్లకుపైగా రుణం తీసుకున్నారు. ఈ బ్యాంకుకు ఇంకా రూ. 18 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఒక బ్యాంకులో శీతల గోదాము మీద, అందులో ఉన్న సరకు మీద రుణాలు తీసుకున్నాక.. అదే సరకు చూపించి మరో బ్యాంకుకు రుణం కోసం వెళ్లకూడదు. ఇక్కడ ఇందుకు విరుద్ధంగా జరిగింది. ఇది బయటపడ్డాక తొలుత రుణం ఇచ్చిన బ్యాంకు సిబ్బంది వెళ్లి మరో బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించారు.

రూ. కోట్ల రుణాలు మంజూరు చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఇలాంటివి పునరావృతమవుతున్నాయి. ఇలా రుణాలు పొందుతున్న వ్యక్తులు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోతే అంతిమంగా రైతులు బాధితులవుతున్నారు.

నమ్మి నిల్వ చేస్తే మోసం

★ రైతులు పండించిన మిర్చిని గుంటూరు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లోని శీతల గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. ఒక్క గుంటూరు నగరంలోనే ప్రస్తుతం 45 లక్షల బస్తాలు నిల్వ ఉన్నాయి. శీతల గోదాముల యజమానుల మీద నమ్మకంతో రైతులు మిర్చి నిల్వ బాండ్లు తీసుకోవడం లేదు.

★ మంచి ధర వచ్చినప్పుడు గోదాము యజమానులే యార్డుకు నమూనాలు తీసుకెళ్లి అమ్మకానికి పెడుతున్నారు. వ్యాపారులు నిర్ణయించిన ధరను రైతులకు తెలియజేసి, వారి అంగీకారం పొంది విక్రయిస్తున్నారు. ఇలా కొన్నేళ్లుగా జరుగుతోంది.

★ యార్డులో ఏటా కొంతమంది వ్యాపారులు ఐపీలు పెడుతున్నారు. దీనివల్ల రైతులే మోసపోతున్నారు. వ్యాపారులు వారి ఆర్థిక పరిస్థితికి మించి లావాదేవీలు చేయడం వల్లనే ఈ పరిస్థితి వస్తోంది.

★ గుంటూరు మిర్చియార్డుకు ఏటా రూ. వంద కోట్ల వరకు మార్కెట్ సెస్సు రూపంలో ఆదాయం వస్తున్నా.. మార్కెటింగ్‌శాఖ నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం లేదు. ఈ విషయమై మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకుడు శ్రీనివాసరావును వివరణ కోరగా శీతల గోదాముల్లో అక్రమాలు పునరావృతం కాకుండా యజమానులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు.

బినామీ పేర్లతో రుణాలు



రైతులకు చెప్పకుండానే మిర్చి అమ్మకాలు
గోదాము యాజమాన్యం.. వ్యాపారి కుమ్మక్కు

న్యూస్‌టుడే – మిర్చియార్డు

గుంటూరు నల్లపాడురోడ్డులోని రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజి యాజమాన్యం, మిర్చి వ్యాపారి కూడబలుక్కుని కుమ్మక్కై రైతుల్ని నిలువునా దగా చేశారని పోలీసు, మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలిపారు. లక్ష్మి చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ పేరిట మిర్చి వ్యాపారం చేస్తున్న పాతగుంటూరుకు చెందిన రామచంద్రరావు అలియాస్ రాము గత సీజన్‌లో రాఘవేంద్ర, తియ్యగూర కోల్డ్‌స్టోరేజిలను అనాథరైజ్డ్‌గా అద్దెకు తీసుకున్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన పలువురు రైతులు తమ బస్తాలను ఈ గిడ్డంగుల్లో నిల్వ చేశారు. రాము బినామీ పేర్లతో రుణం తీసుకోవడంతోపాటు మరికొంత సరకును రైతులకు తెలియకుండానే అమ్మేశారు. మంగళవారం మార్కెటింగ్ జేసీ శ్రీనివాసరావు, సీఐ వంశీధర్, మిర్చి యార్డు కార్యదర్శి ఐ.వి. రెడ్డి పూర్తిస్థాయిలో ఆరా తీశారు. శీతలగిడ్డంగి మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, రాము తరఫు గుమస్తాను గట్టిగా ప్రశ్నించడంతో వివరాలన్నీ బయటకొచ్చాయి. రికార్డులను నల్లపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బినామీ రైతుల పేర్లతో తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్, జీడీసీసీ బ్యాంకుల్లో కోట్లాది రూపాయల రుణాలు పొందడంతో మేనేజర్లు వచ్చి పరిశీలించారు. బాండ్లపై అసలు యజమాని శివనాగిరెడ్డి సంతకమే ఉందని, ఇద్దరూ కుమ్మక్కై ఈ మోసానికి పాల్పడ్డారని పోలీసులు చెప్పారు.

రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజిలో..

9,719	రైతులు నిల్వ చేసిన మిర్చి బస్తాలు:
2,577	విక్రయించినవి
2,849	బినామీ పేర్లతో రుణం తీసుకున్నది
4,293	యార్డులో మిగిలిన బస్తాలు


శీతల గిడ్డంగి మేనేజర్ వెంకటేశ్వరరెడ్డిని విచారిస్తున్న మార్కెటింగ్ జేసీ శ్రీనివాసరావు, నల్లపాడు సీఐ వంశీధర్

బ్లాక్ లిస్ట్‌లో..

మోసానికి పాల్పడ్డ రాము ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గోదాము యజమాని శివనాగిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మొత్తం విషయాన్ని మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు.. కలెక్టరు నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు చెల్లించాల్సిన సొమ్ము సుమారు రూ. 3 కోట్ల వరకు ఉంటుందని నిర్ధయించారు. ఈ నేపథ్యంలో రాము ఆస్తులు విక్రయించకుండా జిల్లా రిజిస్ట్రార్‌తో చర్చించి బ్లాక్ లిస్టులో పెట్టామని జేడీ శ్రీనివాసరావు తెలిపారు.

నల్లపాడు బ్రాంచి నుంచి రూ.4 కోట్లు

ఈనాడు, అమరావతి: నల్లపాడులోని రాఘవేంద్ర శీతల గోదాములో సరకు చూపించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు బ్రాంచిలో రూ. 4 కోట్ల రుణం తీసుకున్నారు. 61 మంది రైతులు మిర్చి నిల్వ చేసినట్టు చూపించి ఈ రుణం తీసుకున్నారు. ఈ బకాయి చెల్లించకుండానే అందులో కొన్ని బస్తాలు విక్రయించడం గమనార్హం. రుణం తీసుకున్న తరువాత విక్రయించాలంటే బ్యాంకు అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో బ్యాంకు మేనేజరు మంగళవారం శీతలగోదాము పరిశీలనకు వెళ్లారు. నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టెట్‌కు వేళాయె

రేపటి నుంచే పరీక్షలు
ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాల్లో ఏర్పాట్లు

ఈనాడు – అమరావతి



గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క డీఎస్సీ పరీక్షనూ నిర్వహించలేదు. ఉపాధ్యాయ కొలువుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా తొలుత టెట్ ఆపై డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంది. 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం గురువారం నుంచి ఈ నెల 21 వరకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) జరగనుంది. ఇందుకోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 8 కేంద్రాల్లో 30 వేల మంది అభ్యర్థులకు తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్‌కు అప్పగించింది. పరీక్ష సమయంలో విద్యుత్తు అంతరాయం, కంప్యూటర్లు మొరాయించడం వంటి అంతరాయాలేని కళాశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఇందులో అర్హత సాధిస్తేనే.. టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాయడానికి వీలవుతుంది. అభ్యర్థుల హాల్‌టికెట్లలో ఆయా పరీక్ష కేంద్రాల పూర్తి చిరునామాలు పేర్కొన్నారు. వాటిని సులభంగా చేరుకోవచ్చని విద్యాశాఖవర్గాలు తెలిపాయి. బాపట్ల జిల్లాలో పరీక్ష కేంద్రాల్లేవు.

గుంటూరు జిల్లాలో పరీక్ష కేంద్రాల వివరాలు

సెంటర్ కోడ్	కేంద్రం పేరు	పూర్తి చిరునామా
7996	ఐయాన్ డిజిటల్ జోన్, పేరేచర్ల	యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, డోకిపర్రు, నియర్ పేరేచర్ల, నరసరావుపేట రోడ్, మేడికొండూరు మండలం
8891	మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్	పుల్లడిగుంట, ప్రత్తిపాడు మెయిన్‌రోడ్, వట్టిచెరుకూరు మండలం
9651	ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్	ఐదవ మైలు, కొర్నెపాడు, ప్రత్తిపాడు మెయిన్ రోడ్, వట్టిచెరుకూరు మండలం
30318	బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	బ్లాకు–బి, చల్లావారిపాలెం, నల్లపాడు రోడ్, గుంటూరు
పల్నాడు జిల్లాలో....		
1229	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట
9652	మామ్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ	కేశానుపల్లి, నరసరావుపేట మండలం,
8890	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్‌బ్లాకు–4	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట మండలం
9136	ఎ.ఎంరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	వినుకొండ రోడ్, అట్లూరి మస్తాన్‌రెడ్డి నగర్, పెట్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు

– డీఈవో శైలజ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో టెట్‌కు 18,476 మంది హాజరుకానున్నారని డీఈవో శైలజ తెలిపారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఉదయం సెషన్ పరీక్ష 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ 2.30 గంటలకు ఉంటుందని తెలిపారు. నిర్దేశిత సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, చరవాణిలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లుతో పాటు ఆధార్ గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని సూచించారు.

ఇంజినీరింగ్ కళాశాలకు దిక్కెవరు?

ప్రత్యేక కోర్సులకు బోధకులే లేరు
సీఎస్‌ఈ విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ లేదు

న్యూస్‌టుడే, ఏఎన్‌యు

ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అన్ని విధాలుగా మొదటిస్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తరచూ ఉద్బోధ చేస్తున్నా.. ఏఎన్‌యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఏటా ప్రవేశాలు పెరుగుతున్నా.. అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు, అధ్యాపకులు లేకపోవడంతో తరగతులు తూతూమంత్రంగానే నడుస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో ఉన్న ఈ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు గత పాలకులు దృష్టి పెట్టలేదు. అధ్యాపకులను నియమించేందుకూ శ్రద్ధ చూపలేదు.

☛ గతేడాది ఇంజినీరింగ్ కళాశాలలో మూడు ప్రత్యేక కోర్సులు కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులూ ఉత్సాహంగా చేరారు. బోధకులే లేరు.

☛ యూజీసీ నిబంధనల ప్రకారం ఒక్కో విభాగానికి ఒక ప్రొఫెసర్, నలుగురు అసోసియేట్‌లు, ఆరుగురు సహాయ ఆచార్యులు ఉండాలి. ఈ విభాగాలన్నింటికీ కలిపి కనీసం 10 మంది అధ్యాపకులు కూడా లేరు.

☛ జీ, జావా, పైథాన్ ప్రోగ్రామ్‌లను బోధించే బాధ్యతలను ఈసీఈ, ఈఈఈ అధ్యాపకులకు అప్పగించారు.

☛ విద్యార్థులకు బెంచీలు కూడా సరిగా లేవు. ఇటీవలే ఓ సంస్థకు ఆర్డర్ ఇచ్చినట్టు తెలిసింది.


ఏఎన్‌యూలోని ఇంజినీరింగ్ కళాశాల భవనాలు

☛ సీఎస్‌ఈ విద్యార్థులకు ప్రత్యేక భవనం, కంప్యూటర్ ల్యాబ్ లేవు. ఈ ఏడాది ఈ విభాగంలో 120 సీట్లను భర్తీ చేశారు.

☛ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ, ఈఈఈ భవనంలో రెండు అంతస్తులను గతంలో ఎన్ఐడీ వారికిచ్చారు. వీరికి రాజధానిలో భవనం అందుబాటులోకి రావడంతో ఆరు నెలల క్రితం ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఈ రెండు అంతస్తులను సీఎస్‌ఈకి కేటాయించాలని అధ్యాపకులు అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

☛ ఈ పనులన్నీ సక్రమంగా నిర్వహించేలా చూడాల్సిన ప్రిన్సిపల్ టెన్యూర్ ఆగస్టులోనే ముగిసింది. ప్రస్తుతం ఈయన్నే కొనసాగిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న ఇద్దరు ఆచార్యుల్లో ఒకరు గత ఆగస్టులో రాజీనామా చేసి వెళ్లిపోయారు.

☛ ఇంజినీరింగ్ కళాశాల స్థాపించిన తరువాత అప్పటి ప్రభుత్వం ఇచ్చిన జీవో 46 ప్రకారం.. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బోధించే అధ్యాపకులకు పిల్లలు చెల్లించే ఫీజుల నుంచే వేతనాలు చెల్లించే అవకాశం ఉంది. దీన్ని అమల్లోకి తీసుకొచ్చినా అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయడం లేదు.

సాంకేతిక సమస్యలు పరిష్కారం

రేపు రైతు ఖాతాలకు పెట్టుబడి రాయితీ జమ

ఈనాడు, అమరావతి: జిల్లాలో భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రోజుల వ్యవధిలోనే పెట్టుబడి రాయితీ వారి ఖాతాలకు జమ చేసింది. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేయడం నుంచి జాబితాలు ప్రభుత్వానికి పంపడం వరకు వ్యవసాయశాఖ అనుక్షణం అప్రమత్తంగా పనిచేసింది. దీంతో 24,589 మంది రైతులకు రూ. 42.95 కోట్ల పెట్టుబడి రాయితీ మంజూరైంది. అయితే 563 మంది రైతులకు సాంకేతిక కారణాలతో రూ. 40 లక్షలు జమ కాలేదు. దీనిని గుర్తించిన వ్యవసాయశాఖ సోమవారం ఉదయం నుంచి కసరత్తు ప్రారంభించి ఒక్కో రైతు నుంచి వివరాలు సేకరించి వారి బ్యాంకు ఖాతాల వివరాలను ప్రభుత్వానికి పంపింది. రైతుల బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడం, ఎన్‌సీపీఐ మ్యాపింగ్ కాకపోవడం వల్ల సొమ్ము జమ కాలేదని గుర్తించారు. వెంటనే సంబంధిత రైతులతో ఆ రెండు పనులూ మంగళవారం సాయంత్రానికి పూర్తి చేయించారు. బుధవారం సెలవురోజు కావడంతో గురువారం రైతుల ఖాతాలకు సొమ్ము జమమవుతుందని జిల్లా వ్యవసాయాధికారిణి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.

అమృత్.. ఆలస్యం

ఇంకా సిద్ధంకాని డీపీఆర్‌లు

ఈనాడు – అమరావతి

అమృత్ - 2 పథకం ప్రాజెక్టు సవివర పథక నివేదికలు (డీపీఆర్) ఇంతవరకు సిద్ధం కాలేదు. నగర, పురపాలక సంఘాల్లో ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు కేంద్రం ఈ పథకం కింద నిధులు మంజూరు చేసింది. డీపీఆర్‌లు ఆమోదం పొందాకే ఈ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

ఎందుకో జాప్యం!

డీపీఆర్‌ల ప్రతిపాదనలు కోరి ఇప్పటికే చాలారోజులైనా ఇంజినీరింగ్‌వర్గాలు సిద్ధం చేయలేదు. నేరుగా పురపాలకశాఖ ఉన్నతాధికారులే ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఫోన్‌లో మాట్లాడి గట్టిగా ప్రశ్నించడంతో వారిలో చలనం వచ్చింది. కేంద్రం నిధులిస్తామన్నా.. వినియోగించడానికి అభ్యంతరమేమిటి? డీపీఆర్‌ల తయారీకి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించినట్టు తెలిసింది. మొదటి దశలో ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేటల్లో తాగునీటి పథకాల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఉన్నాయి. కారణం.. వాటి నిధులను సక్రమంగా వినియోగించకుండా మున్సిపాల్టీల అధికారులు ఇతరత్రా పనులకు వెచ్చించడమే.

ఎక్కడెక్కడ తాగునీటి రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, ఫిల్టరేషన్ ప్లాంట్లు నిర్మించాలి? ఎంత ఖర్చవుతుంది? ఎన్ని మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు? వాటి పరిధిలోని జనాభా ఎంత? వంటి వివరాలను డీపీఆర్‌లో పొందుపరచాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) నిర్మాణానికి అమృత్-2లో ప్రతిపాదించారు. ఆయా పట్టణాల్లో ఎన్ని ఎస్‌టీపీలు అవసరం? ఎన్ని లీటర్ల నీటిని శుద్ధి చేస్తారు? డీపీఆర్‌లో నివేదించాలని నెల క్రితమే ఆదేశించినా ఇప్పటికీ మున్సిపాల్టీలు స్పందించలేదు. ఉద్యోగుల బదిలీలలో డీపీఆర్‌ల తయారీలో జాప్యం చోటుచేసుకుందని ఇంజినీరింగ్‌వర్గాలు చెబుతున్నాయి.



జిల్లాల వారీగా తాగునీరు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు మంజూరైన నిధులు

జిల్లా	నీటి సరఫరాకు	ఎస్‌టీపీ
	(అంకెలు కోట్ల రూపాయల్లో)	
గుంటూరు	47.14	110.81
పల్నాడు	182.42	93.13
బాపట్ల	80.08	0
మొత్తం	309.64	203.94

★ మొదటి దశకు ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరి పేట, నరసరావు పేటల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఒక్క గుంటూరు నగరంలోనే 20 వేలకు పైగా కనెక్షన్లు ఇచ్చారు.

అమృత్ రెండో దశకు ఎంపికైన పట్టణాలు: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ.

నాలుగైదు రోజుల్లో సిద్ధం చేస్తాం

గతంలోనే డీపీఆర్‌లు సిద్ధం చేశాం. ఎమ్మెల్యేలు మారినందున కొత్తవారి అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. రిజర్వాయర్లు, ఎస్‌టీపీల నిర్మాణాలకు ఏమైనా సూచనలు చేస్తే వాటిని కచ్చితంగా పొందుపరచాల్సి ఉంది. అందుకే వారందరి అభిప్రాయాలు తీసుకుని నాలుగైదు రోజుల్లో డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపుతాం. – ప్రజారోగ్య ఇంజినీరింగ్‌వర్గాలు

ఓటరు దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

కలెక్టరేట్(గుంటూరు): ప్రత్యేక సమ్మరీ రివిజన్-2025లో ఓటరు కార్డుల ఇంటింటి పరిశీలన, ఓటర్ల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఎస్ఎస్ఆర్-2025పై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఓటరు కార్డుల ఇంటింటి పరిశీలన 99.56 శాతం పూర్తయ్యిందని, నిర్ణీత సమయంలో పూర్తయిన దరఖాస్తులను పరిశీలించి అక్టోబర్ 5వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. డీఎస్ఈలు, మరణించిన వారి ఓట్ల జాబితాను పునఃపరిశీలన చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ బూత్‌ల జియోమ్యాపింగ్ అప్‌డేట్, రేషనలైజేషన్, మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ప్రతిపాదనలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బదిలీలు అనంతరం ఏఈఆర్వోలు, బీఎల్‌వోల వివరాలను అప్‌డేట్ చేస్తామని వివరించారు. అనంతరం ఈఆర్వోలతో కలెక్టర్ సమావేశమై ఎస్ఎస్ఆర్ నిర్వహణపై సూచనలు చేశారు. వీసీలో జేసీ ఎ.భార్గవ్ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో పి.రోజా, ఈఆర్వోలు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రెండింతల ఆనందం..

వరద, ముంపు బాధిత పింఛనుదారులకు ప్రత్యేక అవకాశం

కొల్లిపర, న్యూస్‌టుడే: పింఛను సొమ్ము కోల్పోయామనుకున్న వృద్ధుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. వరద ముంపు, భారీ వర్షాలతో ప్రాణాలు అరచేత పట్టుకుని పునరావాస కేంద్రాలు, బంధు మిత్రుల ఇళ్లలో తలదాచుకున్న వృద్ధులు సెప్టెంబరు 1వ తేదీన పింఛను పొందలేక పోయారు. గత నెలలో పొందలేని పింఛనుదారులకు సెప్టెంబరు, అక్టోబరు నెలల మొత్తం సొమ్మును కలిపి కూటమి ప్రభుత్వం మంగళవారం అందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వృద్ధులు అనారోగ్య లేక మరే ఇతర సమస్యలతో పింఛను సొమ్ము తీసుకోకుంటే ఆ నెల సొమ్మును ప్రభుత్వ ఖజానా ఖాతాలో కలుపుకోవడం పరిపాటి.

రెండు నెలల పింఛను అందుకున్న వరద బాధితుల వివరాలు

మండలం	లబ్ధిదారులు
కొల్లిపర	57
మంగళగిరి	49
మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ	60
తాడేపల్లి	27
తాడికొండ	50
తుళ్లూరు	68



అన్నవరపులంక: నదిదాటి వచ్చి పింఛను ఇస్తున్న సిబ్బంది

పింఛను సొమ్ము కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడా ముప్పు తప్పిందని వృద్ధులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పడవల్లో వెళ్లి ఇచ్చారు..

పింఛను పంపిణీలో ప్రభుత్వ సిబ్బంది క్రియాశీలక పాత్రను పోషిస్తున్నారు. ఉదయమే పడవల్లో కృష్ణానది (ఏరుదాటి) లంక గ్రామాలకు చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. కొల్లిపర మండలం అన్నవరపులంక, కొత్తూరులంక, బొమ్మువానిపాలెం తదితర గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలకే 85 శాతం లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందజేశారు. గత నెలలో అందుకోని ఒక్కో వృద్ధుడికి రెండు నెలల పింఛను కలిపి రూ. 8,000 అందజేశారు. ఈ మండలంలో 98 శాతం అందజేశారు.

రూ.12 వేలు అందుకున్నా..



వరద ముంపు కారణంగా పింఛను సొమ్ము తీసుకోలేకపోయా. వృద్ధాప్యం, వైకల్యం, ముంపు భయంతో పిల్లల ఇంటికి చేరుకున్నా. పింఛను ఇస్తున్నారని తెలిసినా రాలేని స్థితి. కూటమి ప్రభుత్వంలో గత నెల కలిపి రూ. 12 వేలు పింఛను సొమ్ము అందుకున్నా. ఎంతో సంతోషంగా ఉంది.

-కొల్లి బ్రహ్మారెడ్డి, బొమ్మువానిపాలెం

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తికి చర్యలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియను అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియ గురించి కలెక్టర్ వివరించారు. వీసీలో జేసీ ఎ.భార్గవ్ తేజ, సహాయ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పి.రోజా, ప్రత్యేక ఉప కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ పాల్గొన్నారు.

65,463 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు, న్యూస్‌టుడే: మిర్చియార్డుకు రైతులు మంగళవారం 63,626 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 65,463 బస్తాల అమ్మకాలు జరిగాయి. మిర్చి సీజన్ ముగిసిన అన్‌సీజన్‌లో ఇంత అధిక సరుకు విక్రయం జరగడం ఇదే ప్రథమం. క్రయవిక్రయాలు ముగిసే సమయానికి యార్డులో 25,489 బస్తాల నిల్వ ఉన్నాయి. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,500-16,800, నాన్ ఏసీ స్పెషల్ మిర్చి రకాల సగటు ధర రూ. 8,000-18,700, తాలు మిర్చికి రూ. 5,000-12,000 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9,000-16,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,500-18,700, తాలు మిర్చికి రూ. 6,000-11,500 ధర లభించింది.

అబ్కారీ శాఖ ఉన్నతాధికారుల బాధ్యతల స్వీకరణ



మారయ్యబాబు



సూర్యనారాయణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆబ్కారీ శాఖ గుంటూరు ఏఈఎస్‌గా ఈడే మారయ్యబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌గా జి. సూర్యనారాయణ మంగళవారం గుంటూరులోని తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. మారయ్యబాబు గతంలో గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి, చీమకుర్తి, మంగళగిరిలలో ఆశాఖ ఎస్ఐగా, సీఐగా విధులు నిర్వహించారు. ఏఈఎస్‌గా ఉద్యోగోన్నతి పొంది ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా, గంజాయి, మత్తుపదార్థాలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ★ సూర్యనారాయణ గతంలో నాయుడుపేట, గుంటూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, ఒంగోలులో ఆ శాఖ ఎస్ఐ, సీఐగా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై ఎన్‌ఫోర్సుమెంట్ ఏఈఎస్‌గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా, గంజాయి, మత్తుపదార్థాలను కట్టడి చేసేందుకు గట్టిగా కృషి చేస్తానని చెప్పారు.

క్రీడా క్యాలెండర్ విడుదల

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే 2024-25 సంవత్సర క్రీడా క్యాలెండర్‌ను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మంగళవారం ఆవిష్కరించారు. ఏఎన్‌యూ పరిధిలోని కళాశాలలకు ఈ పోటీలను నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. క్రీడా షెడ్యూల్ ప్రకారం కళాశాలలు ఈ పోటీలను పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వ్యాయామ విద్యా శాఖ సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్, డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

97.22 శాతం మందికి పింఛన్ల పంపిణీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో మొదటి రోజు 97.22 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ప్రభుత్వ విభాగాల ఉద్యోగులు గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు రూ. 4 వేలు చొప్పున అందజేశారు. జిల్లాలో 2,56,017 మంది పింఛన్‌దారులకు రూ. 109.19 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. 2,48,901 మందికి రూ. 106.10 కోట్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేయనున్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాల్సిందే

కలెక్టరేట్ ఎదుట మూడు రోజుల పాటు రిలే దీక్షలు



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోరుతూ మూడు రోజుల రిలే నిరాహార దీక్షను మంగళవారం కలెక్టరేట్ ఎదుట ప్రారంభించారు. దీక్షను నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ ప్రారంభించి ప్రసంగించారు. దీక్షలో కూర్చున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నాసరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్యలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. ప్రయివేటీకరణ చేయబోమని చెబుతూనే మరోవైపు 5 వేల మంది ఒప్పంద ఉద్యోగులను వేరేచోటుకు బదిలీ చేయడం దారుణమన్నారు. 32 మంది ప్రజల ప్రాణత్యాగాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారం తెలుగు వారి ఆత్మగౌరవమని, అటువంటి పరిశ్రమను ప్రయివేటుపరం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడతామన్న నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారన్నారు. మొదటిరోజు దీక్షను ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నాయకులు నవీన్, యశ్వంత్, పవన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శేఖర్, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు మానస, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సి ఉన్నందున నల్లపాడు-బండారుపల్లి మధ్య ఉన్న రైల్వే గేటు(7)ను ఈనెల 2వ తేదీ ఉదయం 6 నుంచి 3వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. దీని వల్ల ఆ రెండు రోజులు ఆ మార్గాన రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయం విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష -2025 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొఛాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ప్రవేశ పరీక్ష, విద్యావిధానం, మెరిట్ విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, స్కాలర్‌షిప్, ప్లేస్‌మెంట్స్ తదితర అంశాలను వివరించారు. మూడు విడతల్లో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా పరీక్షలు ఉంటాయని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడత డిసెంబర్ 6 నుంచి 13 వరకు నిర్వహిస్తామని చెప్పారు.



ప్రవేశ పరీక్ష పోస్టర్ విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొఛాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు తదితరులు

టెన్నిస్‌లో గుంటూరు సర్కిల్‌కు మొదటి స్థానం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డు క్రీడా మండలి ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో జరిగిన ఇంటర్ సర్కిల్ టెన్నిస్ పోటీల్లో గుంటూరు సర్కిల్‌కు మొదటి స్థానం దక్కింది. ఓపెన్ సింగిల్స్‌లో మహేష్(తెనాలి, లైన్‌మెన్), డబుల్స్‌లో ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, మహేష్ జట్టు విజేతలుగా నిలవగా, సుందరంబాబు (డిప్యూటీ ఈఈ), ఉదయ్‌కుమార్ (డిప్యూటీ ఈఈ) జట్టుకు మూడో స్థానం దక్కింది. టెన్నిస్ ఛాంపియన్ ఆఫ్ ది ఇయర్‌గా మహేష్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా మూర్తిని ఎంపిక చేశారు. విద్యుత్తు భవన్‌లో మంగళవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ఎస్ఈ మూర్తి అభినందించారు. కార్యక్రమంలో క్రీడా మండలి కార్యదర్శి సుధీర్, కార్యదర్శి సోమశేఖరరెడ్డి, కోశాధికారి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న మూర్తి

4న అంబటి ప్రమాణ స్వీకారం

గోరంట్ల: గుంటూరు జిల్లా వైకాపా అధ్యక్షుడిగా తాను ఈ నెల 4వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరులోని కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించామన్నారు. ఏడు నియోజకవర్గాల్లో పార్టీ జెండాను ఎగురవేసేలా పని చేస్తానని తెలిపారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుతో కలిసి జిల్లాలో వైకాపాను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రజా సమస్యలపైనే మా పోరాటం ఉంటుందని పేర్కొన్నారు. గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 4న సాయంత్రం ప్రమాణస్వీకారోత్సవం ఉంటుందని తెలిపారు. సమావేశంలో గ్రంథాలయ పరిషత్తు మాజీ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

తొలి రోజు ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన విధానంలో భాగంగా జిల్లాలో 127 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆబ్కారీ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అందులో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 33 దుకాణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని ఆశాఖ అధికారులు ప్రకటించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా, ఆఫ్‌లైన్‌లో అబ్కారీ పోలీసుస్టేషన్‌లో అందించేలా ఏర్పాట్లు చేశారు. నూతన మద్యం పాలసీ గురించి తెలుసుకోవటానికి మంగళవారం వ్యాపారులు ఆబ్కారీశాఖ కార్యాలయాల, స్టేషన్ల వద్దకు చేరుకున్నారు. తొలి రోజు జిల్లా వ్యాప్తంగా ఒక దరఖాస్తు నమోదు కాలేదు. ఈ నెల 2వ తేదీ అమావాస్య కావడంతో గురువారం నుంచి దరఖాస్తులు దాఖలు అవుతాయని ఆశాఖ అధికారులు భావిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: డీసీ శ్రీనివాసులు

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అన్ని ఏర్పాట్లు చేశాం. గతంలో ఎన్నడులేని విధంగా ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా, ఎక్కడైనా, ఎన్ని దుకాణాలకైనా దాఖలు చేసుకోవచ్చు. 11న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు ఎంపిక పారదర్శకంగా ఉంటుంది.

మిర్చి రైతులూ.. బాండ్లు భద్రపర్చుకోండి

మిర్చియార్డు: శీతలగిడ్డంగుల్లో సరకు నిల్వ ఉంచిన మిర్చి రైతులు అసలైన బాండ్లను భద్రపర్చుకోవాలని మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు సూచించారు. రాఘవేంద్ర శీతలగిడ్డంగి యాజమాన్యం, వ్యాపారి.. మిర్చి రైతులకు తెలియకుండా బినామీ పేర్లతో రుణం పొందారన్నారు. శీతలగిడ్డంగుల్లో నిల్వ ఉంచిన సమయంలో రైతులకు యాజమాన్యం బాండు ఇస్తుందన్నారు. కొంత మంది రైతులు వ్యాపారులను నమ్మి శీతలగిడ్డంగి ఇచ్చే బాండ్లను తీసుకువెళ్లకుండా వ్యాపారుల వద్ద ఉంచడం వల్ల వారికి తెలియకుండా బినామీ పేర్లతో రుణాలు తీసుకోవడం, అమ్ముకోవడం చేస్తున్నారన్నారు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారన్నారు. సరకు అమ్ముకునే వరకు విధిగా రైతులు బాండ్లను వారి వద్దే పెట్టుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల దుస్థితిపై 'ఈనాడు'లో ఈ నెల ఒకటో తేదీ 'దృష్టి సారిస్తేనే ఆదాయం..!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగరపాలక కమిషనర్ అలీంబాషా మంగళవారం ఆయా కేంద్రాలను పరిశీలించారు. వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. రెండు గ్రామీణ మండలాల్లో వీటి పనితీరును మెరుగుపరుస్తామని వివరించారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు. పార్వతీ దేవి అమ్మవారికి తొమ్మిది సార్లు మణిదీప వర్ణన పారాయణ చేశారు. అనంతరం మహిళలకు గాజులు పంచి అన్నదాన ప్రసాద వితరణ చేశారు.



తుళ్లూరులో శివాలయంలో..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ గ్రామంలోని పాతసినిమాహాల్ సెంటర్ సమీపంలో రాత్రివేళ వీధి దీపాలు వెలగడం లేదు. **-శశి, గ్రామస్థుడు**

✔ వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **-రవికుమార్, ఏఈ, విద్యుత్‌శాఖ**

పూడిక తీశారు


స్పందనకు వందనం

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలోని చెంచుకాలనీలో ప్రధాన మురుగుకాలువ పూడిపోయింది. దుర్వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన గత 30న 'ఈనాడు' ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి స్పందించారు. జేసీబీ సాయంతో పూడికలు తీయించారు.

రైతులకు రుణాలేవి..?

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని రైతు సేవా కేంద్రాలలో ఎరువులు విక్రయించడం లేదని దుక్కులు దున్నే తరుణంలో రైతులకు ఎరువులు సరఫరా చేయకపోతే ఎలా అని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటశివరావు అన్నారు. మంగళవారం ఆయన తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పెదనందిపాడు సొసైటీలో రైతులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేష్‌బాబు, రాజేంద్ర, యానాదులు పాల్గొన్నారు.

బాపూ మార్గం.. చైతన్య శిఖరం



తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

మహాత్ముని ఆశయాల సాధనకు 'కూటమి' కృషి

నేడు గాంధీ జయంతి

మహాత్మా గాంధీజీ ఆశయాలు భారతావనిలో నిత్యం స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి. ఆయన చూపిన అహింసా మార్గం మొత్తం ప్రపంచానికే దిక్సూచి. ఆ మహనీయుడి ఆశయాలను ఆచరణలో పెడుతూ 'కూటమి' ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్వచ్ఛ నగరాలు, పల్లెలు, పట్టణాలే లక్ష్యంగా ప్రణాళికలు రచించింది. ఉపాధి పనులకు సైతం ఊతమిస్తూ పల్లెల ప్రగతికి బాటలు వేస్తోంది. నేడు గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

స్వచ్ఛత వైపు అడుగులు..

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోంది. 'క్లీన్ అండ్ గ్రీన్' నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత కారణమైన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించేందుకు ప్రత్యేక బృందాన్ని తన సొంత నగదుతో ఏర్పాటు చేశారు. దాదాపుగా ఒక్కొక్క యంత్రం రూ.18వేలతో కొనుగోలు చేశారు.



మంగళగిరి: మంత్రి నారా లోకేశ్ సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన యంత్రాలతో శుభ్రతా చర్యలు



మంగళగిరిలో వీధులు శుభ్రపరుస్తున్న నగరపాలక కమిషనర్ అలీంబాషా, సిబ్బంది

వాటిని వినియోగించే కార్మికులకు కూడా వేతనాలను అందిస్తున్నారు. మరోవైపు మంత్రి ఆదేశాలతో నగరపాలక అధికారులు పరిసరాల పరిశుభ్రత, వాతావరణ కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాన్ని నగరంలో సమర్థంగా అమలు చేస్తున్నారు. కమిషనర్ అలీంబాష నేతృత్వంలో నగరంలోనే అన్ని ప్రాంతాల్లో ప్రతీరోజు మొక్కలు నాటడం, పిచ్చి మొక్కలు తొలగించడం వంటి కార్యక్రమాలతో పాటు ఎంతోకాలంగా మురుగుకాలువల్లో పేరుకుపోయిన పూడికలను తీయిస్తున్నారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు వరంలా మారింది. గ్రామ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు, వ్యవసాయ, అనుబంధ రంగాలు, గ్రామాల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పనకు వీలు కల్పించింది. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగు నీటి కాల్వల నిర్మాణం, పాఠశాలలకు ప్రహరీలు, శ్మశాన వాటిక అభివృద్ధి సహా గ్రామాల ప్రగతికి ఇప్పుడు ప్రజల చేతిలో ఉంది. అభివృద్ధి పనులకు నిధుల కోసం ఎదురు చూడకుండానే ప్రజలు ఉపాధి కార్డు తీసుకుని పనిలోకి వెళితే చాలు. ఉపాధి హామీ పథకంలో 60 శాతం సొమ్ము కూలీలకు, 40 శాతం సొమ్ము సామగ్రి విభాగానికి కేటాయించారు. ఈ 40శాతం సొమ్ముతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. ఎంత ఎక్కువ మంది కూలీలు పనులకు వెళితే గ్రామాలకు అంత మేలు జరగనుంది. ప్రభుత్వ, బంజరు భూముల్లో మొక్కల పెంపకం వంటి 36 రకాల పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేసేందుకు అవకాశం కల్పించింది.

పల్లెల్లో ఉపాధికి ఊపిరి

ప్రత్తిపాడు నియోజకవర్గంలో...

మండలాలు: 5, ఎంపిక చేసిన పనులు : 366

మంజూరు చేసిన బడ్జెట్: రూ.5.09 కోట్లు



ప్రత్తిపాడు: సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపిక చేసిన రహదారి

తాడికొండ నియోజకవర్గంలో..

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఫిరంగిపురం మండలానికి పనిదినాల వేతనానికి రూ.8 కోట్లు, పరిసరాలు, భవన నిర్మాణ పనులకు రూ.1.28 కోట్లు మొత్తంగా రూ.9.28 కోట్లు నిధులు మంజూరయ్యాయి. తుళ్లూరు మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 5254 జాబ్ కార్డులు, 7811 మంది కూలీలు ఉన్నారు. పని దినాలు, భవన నిర్మాణాలు, రహదారులు, కాలువలు త్రవ్వడం, మొక్కలు నాటడం, సామగ్రి కొనుగోలుకు సంబంధించి సుమారు రూ.2 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

వెతలు తీర్చాలని వేడుకోలు



దివ్యాంగుడి సమస్య వింటున్న మంత్రి

'ప్రజా దర్బార్'లో వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కొనసాగుతున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 'ప్రజా దర్బార్'కు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. మంగళవారం వేకువజాము నుంచే ఉండవల్లి నివాసం వద్దకు చేరుకుని సమస్యలను నేరుగా మంత్రికి వివరించి అర్జీలు అందజేశారు. పలువురు గ్రామస్థుల నుంచి రూ.3 కోట్లు వరకు అప్పులు తీసుకుని పరారైన శ్రీనివాసరావును అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని మంగళగిరి మండలం పెదవడ్లపూడి మాజీ సర్పంచి అన్నె చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి పూర్తిగా పాడైపోయిందని నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన బాధితుడు అర్జీ ఇచ్చారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న తనకు రోడ్డు ప్రమాదం కారణంగా రెండు కాళ్లు కోల్పోయానని సాయం అందించాలని మంగళగిరికి చెందిన సమ్మంగి బాలాజీ కన్నీళ్ల పర్యంతమయ్యారు. పక్షవాతంతో బాధపడుతున్న తనకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన అక్కల శివశంకరరావు, వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఆత్మకూరు వడ్డెరపాలేనికి చెందిన వేముల సీతమ్మ కోరారు. దివ్యాంగురాలినైన తనకు ఉద్యోగం ఇప్పించాలని ఆత్మకూరు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రాధాకీర్తి విజ్ఞప్తి చేశారు.



పాత మంగళగిరిలో అబద్ధయ్య, అధికారులు, నాయకులు



మేడికొండూరు: డోకిపర్రులో ఎంపీడీవో చందన, అధికారులు, నాయకులు



లాలుపురంలో లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు, పక్కన ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు



ప్రత్తిపాడు: కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కె.శివపార్వతి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ షేక్.ఖాజా

ఊరూరా పింఛను పండగ

న్యూస్‌టుడే బృందం: మంగళగిరి, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెంచిన పింఛను మొత్తాన్ని ఉదయం నుంచే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ఇంటింటికీ తీసుకెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. తుళ్లూరు మండలంలో 97 శాతం, ప్రత్తిపాడు మండలంలో 95.74 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. రూరల్ మండలంలోని లాలుపురంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రాలను సత్కరించారు. స్వర్ణ ఆంధ్ర 2047 క్యూ ఆర్ కోడ్ కార్యక్రమం అమలుతీరు పరిశీలించారు. పాత మంగళగిరి బోసుబొమ్మ కూడలిలో పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అలీంబాషా, అడిషినల్ కమిషనర్ శకుంతల, తెదేపా నాయకులు గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



నిడుముక్కలలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు

సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రగతి పథం..

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో శ్రావణ్ కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తాయన్నారు. జీవాల ఆరోగ్యంతో మరణించిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతా రామారావు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తహసీల్దారు నాసరయ్య, ఎంపీడీవో, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో..

చిరుధాన్యాలతో ఆరోగ్యవంత జీవనం

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్‌లో కర్షక సేవా కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన చిరుధాన్యాల వంటకాలు, తయారీపై శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. 'మిల్లెట్' రాంబాబు మాట్లాడుతూ అరికల వడ, సామల సాంబార్ రైస్, సామల దోసెలు, అండు కొర్రల ఇడ్లీలు తదితర వంటకాల తయారీని వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు.

మద్యం దుకాణం ఎత్తివేయండి

గ్రామస్థుల డిమాండ్



మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరులో ప్రభుత్వ మద్యం దుకాణం ఉన్నచోట నుంచి తీసేయాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివార్లో రోడ్డు పక్కన గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. పక్కనే ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి రోజూ మంగళగిరిపాడు, తురకపాలెం, డోకిపర్రు గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు అదే రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మందుబాబులు రోడ్డుకు ఇరువైపులా గుంపులుగా కూర్చొంటున్నారు. రోడ్డు పక్కనే మంచి నీళ్లు, గ్లాసులు, శీతల పానీయాలు, తినుబండారాలు అమ్మేందుకు దుకాణాలు వెలిశాయి. దీంతో మంద బాబులు అక్కడకు చేరుకుంటున్నారు. ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కన నిలిపి అక్కడే మద్యం తాగుతున్నారు. కారణంతో పొలం పనికి వెళ్లే మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడితే ఆ రోడ్డులో వెళ్లాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి దుకాణాన్ని వేరుచోటుకు మార్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మృతుల ఓట్లను తగిన ఆధారాలతో తొలగిస్తాం



మాట్లాడుతున్న గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాలో ఉన్న మృతుల ఓట్లను తగిన ఆధారాలు తీసుకుని తొలగిస్తామని గుంటూరు ఆర్డీవో, ఆర్వో కె.శ్రీనివాసరావు చెప్పారు. ఓటర్ల జాబితాలపై సర్వే, పోలింగ్ కేంద్రాల విభజనపై రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో 1500లకు పైబడి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి, మరోక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. పెదపలకలూరులోని రత్నగిరికాలనీ 3వ పోలింగ్ కేంద్రంలో 1689 మంది ఓటర్లు ఉన్నారని, జన్మభూమి నగర్ పోలింగ్ కేంద్రంలో 1505 మంది, నల్లపాడులోని 62వ పోలింగ్ కేంద్రంలో 1529 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాలను రెండుగా విభజించి పక్కనే ఏర్పాటు చేసేందుకు తయారు చేసిన ప్రతిపాదనలపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని రాజకీయ పార్టీల నాయకులను ఆర్డీవో కోరారు. పెదనందిపాడు తహసీల్దారు కుమార్‌బాబు, కాకుమాను తహసీల్దారు వెంకట స్వామి, గుంటూరు పశ్చిమ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

తుళ్లూరు, న్యూస్‌టుడే: బోరుపాలెం గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తుళ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు.

దాడి ఘటనపై..

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులో పానీ పూరీ బండి వద్ద జమ్ముల హరికిరణ్ అనే వ్యక్తిపై దాడి చేసిన ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన రాకేష్, ఫిలిప్‌లను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



వాసంతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఇంటూరు వాసంతి ఇటీవల పల్నాడు జిల్లా వినుకొండ లొయోలా పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపింది. అక్టోబర్ 19 నుంచి జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం హెచ్‌ఎం రమేష్, పాఠశాల కమిటీ ఛైర్మన్ శివ, వ్యాయామోపాధ్యాయుడు కరిముల్లా, ఉపాధ్యాయులు అభినందించారు.

దేశ భక్తి అలవర్చుకోండి

పెదనందిపాడు: విద్యార్థులు దేశ భక్తి అలవరచుకోవాలని నాయిబ్ సుబేదార్ రేఖారాం (చీరాల) అన్నారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ సేవలో కూడా కీలక పాత్ర వహించాలని సూచించారు. ఎన్‌సీసీ క్యాడెట్లుగా 27 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హవల్దార్ షంషేర్ సింగ్, ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, పాతూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరును అధికారులు బాలకార్మిక రహిత మండలంగా గుర్తించారని గుంటూరు సహాయ కార్మిక కమిషనర్ ఎస్‌కే మహబూబ్‌సుభాని తెలిపారు. మేడికొండూరులో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం - కార్మికశాఖ ఆధ్వర్యంలో 'బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందఆయన మాట్లాడారు. ఎంపీడీవో చందన, సహాయ కార్మిక అధికారి సాంబిరెడ్డి, ఎంఈవోలు ఏసురత్నం, అబ్దుల్ అలీమ్, ఎస్ఐ డేవిడ్‌రాజు, హెచ్‌ఎం జయప్రద తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన సదస్సు

వింజనంపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వింజనంపాడు గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు 'రోడ్ మ్యాప్ టు టాప్'పై మూల్యాంకన సదస్సు మంగళవారం జరిగింది. ఇందులో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందడంపై నిపుణులు అవగాహన కల్పించారు. శిక్షకుడు పంకజ్‌దివాన్, కళాశాల కార్యదర్శి కోయిసుబ్బారావు, శేఖర్, ప్రిన్సిపల్ బాబు, సంచాలకులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై హ్యాకథాన్

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు) న్యూస్‌టుడే: పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్యమహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం 36 గంటల హ్యాకథాన్ జరిగింది. పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని కోడింగ్ విద్యార్థులు పోటీ పడ్డారు. విజేతలకు సంస్థ ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు బహుమతులు అందజేశారు.

అవీ ఇవీ

ఉపాధ్యాయుడికి సత్కారం

చింతలపూడి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: చింతలపూడిలో ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఉన్నం ప్రసాద్‌ను మంగళవారం స్కూలులో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కసుకుర్తి భాస్కరరావు, విద్యార్థులు సత్కరించారు. గత వారం ఆయన గుర్రం జాషువా అంతర్జాతీయ సాహిత్య, సేవా సంస్థ తరపున గౌరవ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి

మేడికొండూరు, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని ఎన్ఆర్ఐ ఐటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మంగళవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని అహింసా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ శ్రీహరిరావు, అధ్యాపకులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ అనూష, డాక్టర్ శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా మంగళగిరి ఇందిరానగర్‌లో యూపీహెచ్‌సీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీజ, డాక్టర్ అనూష, డాక్టర్ మిట్టల్, డాక్టర్ హారిక పాల్గొన్నారు.

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది మంగళవారం షాపులు మూసివేశారు. సమాచారం తెలుసుకున్న మంగళగిరి ఎక్సైజ్ పోలీసులు అక్కడకు చేరుకుని సిబ్బందితో వాటిని తెరిపించి విక్రయాలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

జూదరులపై నిఘా

దుగ్గిరాల, న్యూస్‌టుడే: చిలువూరు-మంగళగిరి మండలం పెదవడ్లపూడి మధ్య యథేచ్ఛగా జూదం ఆడుతున్నారంటూ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో సమాచారం హల్‌చల్ చేసింది. దీనిపై స్పందించిన డీఎస్పీ రెండు మండలాల పోలీసుల్ని అక్కడకు పంపారు. సరిహద్దులో రాత్రిపూట తోటల్లోకి అప్పుడప్పుడూ ఐదారుగురు వస్తున్నారని తెలిసిందని, దానిపై నిఘా పెట్టామని దుగ్గిరాల పోలీసులు చెప్పారు.

చెకుముకి పరీక్షల్లో ప్రతిభ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక (గుంటూరు) ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షలో గోగులమూడి జడ్పీ ఉన్నత పాఠశాల, పెదనందిపాడు ఎల్ఎం పాఠశాల, విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ద్వితీయ స్థానంలో పెదనందిపాడు జడ్పీ పాఠశాల, నంది పాఠశాల ద్వితీయ, అన్నపర్రు కేఎస్సార్ జడ్పీ పాఠశాల, అశోక ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ, ప్రశంసాపత్రాలను అందజేశారు.

సనాతన ధర్మం పాటించాలి

వరగాని (పెదనందిపాడు) న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు సనాతన ధర్మం పాటించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారికి నాయకులు, భక్తులు పూజలు నిర్వహించారు. ఓం నారాయణ నామ భజన చేశారు. గత ప్రభుత్వం దేవాలయాలపై పెత్తనం చేసి ధర్మాలకు విరుద్ధంగా అపచారాలు చేసిందని ఆయన ఆరోపించారు. నాయకులు త్రినాథ్, నరేంద్ర, శ్రీనివాసరావు, జె. రాంబాబు, తెదేపా నాయకులు వెంకటప్పయ్య, సురేంద్ర, రాంబాబు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె

తెనాలి

•తెనాలి •పొన్నూరు


3న కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ రాక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు తెనాలి జిల్లా ఆసుపత్రికి రానున్నట్లు ఆసుపత్రి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో మూలన పడిన వైద్య పరికరాలు, భద్రతకు వైద్యులు కొరతతో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సిబ్బంది కొరత వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

ఏకరూప దుస్తుల అందజేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అంగలకుదురు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల్లోని ఇంటర్ విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి జగదీష్‌కుమార్ మంగళవారం ఏక రూప దుస్తులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనురాధ, తిరుమలశెట్టి రావు, లక్ష్మిరాజు సాయి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ముగిసిన పవిత్రోత్సవాలు




పవిత్రాలను తీసుకెళ్తున్న అర్చకులు, ఈవో గోగినేని లీలాకుమార్

పెదకాకాని, న్యూస్‌టుడే : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిసినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్రాలను దేవతామూర్తులకు సమర్పించారు. స్వామివారి మూలమంత్ర తత్వార్చన, మంత్ర పుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణతో పవిత్రోత్సవాలు ముగిశాయి.


బాపు మాట.. బంగారు బాట

నేడు గాంధీ జయంతి



కుల, మత, వర్గ ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి దేశ ప్రగతికి బాటలు వేయాలన్న మహాత్ముని మాటలే బంగారు బాటలని, నేటి తరానికి అవి ఆచరణీయమంటున్నారు గాంధీజీ బోధనల ప్రచారకులు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పలువురు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. - తెనాలి టౌన్, న్యూస్‌టుడే

మానవత్వమే మహోన్నతం



మానవత్వమే మహోన్నతమన్న గాంధీజీ మాటలు ఆచరణలోకి వస్తే నేడు సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. సేవే ఆయన అభిమతం. దానిని ఆచరణలో చూపాల్సి ఉంది మనం. మనకు అవకాశం ఉన్నంత వరకు తోటి వారికి ఉపయోగపడే పనులు చేస్తూ ఉంటే చాలు, బాపు మాటలు ఆచరణలోకి తెచ్చినట్లే – వజ్రాల రామలింగాచారి, గాంధీ వృద్ధాశ్రమ నిర్వాహకులు, తెనాలి


ఆయన జీవన 'చిత్రం' అందరికీ తెలియాలి





దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి జీవితాన్ని త్యాగం చేసిన మహాత్ముని జీవన పయనం అందరికీ నిత్య స్మరణీయమే. ఆయన ఆదర్శ బాట గురించి తెలుసుకుని కలిసికట్టుగా ముందుకు సాగాల్సి ఉంది. ప్రతి ఏటా గాంధీ జయంతి, వర్ధంతి సమయాల్లో పిల్లలకు ఆయన చిత్రాలను ఎలా వేయాలో నేర్పటం, ఆయన జీవిత పయనంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నా.
– పణిదెపు వెంకటకృష్ణ, చిత్రకళోపాధ్యాయుడు, పెదరావూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల

అహింసామూర్తి మాట ఆదర్శనీయం





అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీ మాట, ఆయన చూపిన బాట నేటి యువతకు దిక్సూచి. ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొని బాపు బాటలో నడిచి స్వాతంత్ర్య ఫలాలు తీసుకువచ్చిన మహానుభావుల స్మరణ మనందరి బాధ్యత. టైప్ రైటర్ ద్వారా బాపు బొమ్మలను ఆవిష్కరించి సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నాను.
–నిజాముద్దీన్, టైప్ రైటర్ ఆర్టిస్ట్



స్వచ్ఛత సేవ ఆకారంలో విద్యార్థులు

వినూత్నంగా.. అన్ని విభాగాల్లో స్వచ్ఛతే సేవ అన్నది మహాత్ముని ఆశయమని, దాన్ని అందరూ ఆచరించాలని ఆయనకు నిజమైన నివాళి అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. తెనాలి పట్టణ ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి నేపథ్యంలో మంగళవారం విద్యార్థులు స్వచ్ఛత సేవ ఆకారంలో ఒదిగారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ప్రసూనాదేవి, చిత్రకళోపాధ్యాయుడు బెల్లం కొండ వెంకట్, పీఈటీ ప్రేమ్‌నాథ్ పర్యవేక్షించారు.

పోరుబాటును కళ్లకు కట్టారు : గాంధీజీ జయంతి సందర్భంగా పట్టణంలోని మారిస్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రూపకంతో గాంధీ పోరుబాటను కళ్లకు కట్టారు. ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోజెస్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



గాంధీజీ, అనుయాయుల వేషధారణలో చిన్నారులు

కొత్త పింఛన్లకు వచ్చే నెలలో దరఖాస్తులు



తెనాలి: లబ్ధిదారుడికి పింఛన్ నగదు అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కొత్త పింఛన్ మంజూరు చేయాలని, రేషన్‌కార్డు ఇప్పించాలని పలువురు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరగా.. వచ్చే నెలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెనాలి మండలం సోమసుందర పాలెం, కంచర్లపాలెం, తేలప్రోలు, పట్టణంలోని మారీసుపేట, మరంబజారు, ఆర్.ఆర్. నగర్, పినపాడులోని మంగళవారం సామాజిక పింఛన్‌దారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ల తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, వార్డు కౌన్సిలర్లు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు

పెదకాకాని, న్యూస్‌టుడే : తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే పేదల పింఛన్లు పెంచినట్లు ఆ పార్టీ పొన్నూరు నియోజకవర్గ పరిశీలకుడు, మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు తెలిపారు. పెదకాకాని సదాశివకాలనీలో మంగళవారం నిర్వహించిన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలు చేసి ప్రతి ఇంటికి పెద్ద కుమారుడిగా సీఎం చంద్రబాబు నాయుడు నిలిచినట్లు కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకుంటూ సీఎం పేదల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. తెదేపా నాయకులు వలివేటి మురళీకృష్ణ, మల్లికార్జునరావు, పూర్ణ, పాగోలు గోపి, రాము పాల్గొన్నారు.



పెదకాకాని: వితంతు పింఛను పంపిణీ చేస్తున్న మన్నవ సుబ్బారావు తదితరులు

'దేవర' విజయోత్సవాలకు స్థల పరిశీలన

పెదకాకాని: 'దేవర' సినిమా విజయోత్సవాలను నిర్వహించేందుకు నంబూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న స్థలాన్ని మంగళవారం శ్రేయస్ మీడియా సంస్థ నిర్వాహకులు, పెదకాకాని సీఐ నారాయణస్వామి, సీఐ మిరాజ్‌తో కలిసి మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. నిర్వాహకులు ఈ నెల 3న వేడుకలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉందని తెలిసింది.

మాజీ స్పీకర్ బాలయోగికి నివాళి

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని లూథర్‌గిరికాలనీలో మంగళవారం లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెదేపా ప్రభుత్వం దళితులకు ఉన్నత పదవులు కట్టబెట్టి గౌరవం ఇచ్చినట్లు వారు గుర్తు చేశారు.

రవాణా రంగ సమస్యలపై వినతిపత్రం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రవాణా రంగ సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించినట్లు న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చలపతిరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సంఘం తరఫున వరద బాధితుల సహాయార్థం రూ.1.05 లక్షల చెక్కును అందించినట్లు పేర్కొన్నారు.

చిరస్మరణీయులు గోపాలరావు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెలుగు నాటకరంగ చరిత్రలో శతాధిక నాటక కర్తగా పేరొందిన కొడాలి గోపాలరావు చిరస్మరణీయులని వక్తలు పేర్కొన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి తెనాలిశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆయన శతజయంతి కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సమాజసేవకులు తన్నీరు శంకర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, నాటక సంస్థ అధ్యక్షుడు చందు సూర్య తదితరులు గోపాలరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ దేవీచౌక్‌లో కొలువైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. వీరు మంగళవారం ఆలయంలో మాట్లాడారు. రోజుకో అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని వారు వివరించారు. కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకర శాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరామప్రసాద్, సహాయ కార్యదర్శి, సభ్యులు జొన్నలగడ్డ సూర్యభగవాన్, పోలే పెద్ది రామకృష్ణ, పూర్ణభాస్కర్, కాజ శివప్రసాద్, కొండపి శ్రీనివాసరావు అమ్మవారి అలంకారాలు వివరాలు రాసిన ప్రతులను ఆవిష్కరించారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



వివేక్‌రాజ్

పొన్నూరు, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీ నగర్‌లోని సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థి లాం వివేక్‌రాజ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికనైట్లు స్కూల్ ప్రిన్సిపల్ రోజ్ థామస్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థి విశేష ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారని ప్రకటించారు.

తత్వశాస్త్రంపై మరిన్ని పరిశోధనలు అవసరం



పరిశోధన పత్రాలు పంపిన రాజేష్‌కు ధ్రువపత్రం ప్రదానం చేస్తున్న ఆచార్య స్వరూపారాణి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: తత్వశాస్త్రం అధ్యయనపై విద్యార్థులకు అవగాహన పెంచాలని ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి చెప్పారు. ఏఎన్‌యూలో ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ముగింపు సమావేశానికి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు. ఆచార్య స్వరూపారాణి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ సెంటర్‌లో మరిన్ని పరిశోధనలు చేయాలన్నారు. ఆచార్య అశోక్ వోహ్రా మాట్లాడుతూ ఈ రెండు రోజుల సదస్సులో వక్తల నుంచి అభిప్రాయాలను పుస్తక రూపంలో తీసుకొస్తామన్నారు. ఆచార్య నారాయణ చక్రవర్తి, సదస్సు కన్వీనర్ ఆచార్య త్రిమూర్తి రావు మాట్లాడారు. అనంతరం ఉత్తమ పరిశోధన పత్రాలు పంపించిన వారికి ఆచార్య స్వరూపారాణి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ జార్జి విక్టర్, సీడీఈ సంచాలకులు వెంకటేశ్వర్లు, ఆచార్య రమేష్, ఆచార్య రాజు, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ దివ్యతేజోమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ ఉద్యోగులకు నైపుణ్యాలు అవసరం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: హెల్త్‌కేర్ ఉద్యోగులకు నైపుణ్యాలు అవసరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి చెప్పారు. మంగళవారం ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించిన అతిథి అధ్యాపక ఉపన్యాస కార్యక్రమానికి స్వరూపారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోగులు, ఇతర వైద్య నిపుణులతో సంభాషించడానికి మంచి భాషా నైపుణ్యాలు అవసరమన్నారు. అతిథి అధ్యాపకులు ఆచార్య చంద్రమోహన్, విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, అధ్యాపకులు శ్రీనివాస్, డేవిడ్‌రాజు, సాధిక్, శ్రీధర్‌రెడ్డి, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకుని సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో ప్రసాద్ అన్నారు. మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రథమ, నారాకోడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ, వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో గెలుపొందారు. విజేతలు గుంటూరులో జరిగే జిల్లా స్థాయి పోటీకు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రసంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎంఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

పెదకాకాని, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుతారని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జాన్‌బాబు తెలిపారు. పెదకాకాని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'చెకుముకి' సైన్స్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న తల్లిదండ్రులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ నెహ్రూనికేతన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఐదో తరగతి చిన్నారులు తమ పాఠ్యాంశాల్లోని నమూనాలను తయారు చేసి వాటి గురించి వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పర్యవేక్షించారు.

ఉచితంగా పరదాలు పంపిణీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాగితాలు ఏరుకుని జీవించే 40 కుటుంబాల పాకలు దెబ్బతిన్నాయని, వాటికి పైకప్పు వేసుకోనేందుకు ఉచితంగా పరదాలు పంపిణీ చేసినట్లు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఈడీ అల్లాడి దేవకుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం యడ్లలింగయ్య కాలనీలో నిర్వహించిన పరదాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ సమన్వయకర్త రమేష్, రాజశేఖర్, రవితేజ, ఆమని పాల్గొన్నారు.

పెద్దలు నేర్పిన పద్ధతులే భవితకు పునాదులు



రూ.50 వేల చెక్కును సబ్ కలెక్టర్‌కు అందిస్తున్న సంఘ సభ్యులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పెద్దలు నేర్పిన పద్ధతులే భవితకు పునాదులు వేస్తాయని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ పేర్కొన్నారు. సీనియర్ సిటిజెన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో సంఘ భవంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవంగా బాధ్యతతో చూస్తే రేపు మన పిల్లలు కూడా అదే బాటను అనుసరిస్తారన్నారు. సంఘ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన వేడుకలో 104 సంవత్సరాల రావులపల్లి రాజారావు, సహస్ర పూర్ణచంద్ర దర్శనాలు చేసుకున్న 8 మందికి, 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 12 మంది సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. సంఘం తరుపున వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.50 వేల చెక్కును సబ్ కలెక్టర్‌కు అందించారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శబరి వృద్ధాలయంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాది దీపక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వృద్ధులకు పండ్లు పంచారు.

కొల్లిపర, న్యూస్‌టుడే: తూములూరు ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం వృద్ధులతో సమావేశమయ్యారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, విద్యార్థులు, ఉద్యోగులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక 27వ వార్డులోని పక్కా కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలతో మురుగు పారుదల కావట్లేదని, దోమకాటు భరించలేక పోతున్నట్లు స్థానికులు ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక దృష్టికి తీసుకొచ్చారు. ఆమె మంగళవారం 12, 27,38 వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిషనర్ శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ నిర్మల, కౌన్సిలర్లు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులతో కలిసి మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. విభాగం చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య అశోక్‌కుమార్, అబ్రహాం లింకన్, సిబ్బంది పాల్గొన్నారు.

హిజ్రాలపై పోలీసులకు ఫిర్యాదు

చేబ్రోలు: నారాకోడూరులోని ఓ వ్యాపార సముదాయం వద్దకు మంగళవారం రాత్రి తెనాలికి చెందిన సుమారు 20 మంది హిజ్రాలు, వారితోపాటు కొందరు యువకులు వచ్చి తమకు దసరా మామూలు ఇవ్వాలని కోరారు. దుకాణ సిబ్బంది తాము ఉద్యోగులమేనని, అడిగినంత ఇవ్వలేమని చెప్పడంతో అసభ్యంగా ప్రవర్తిస్తూ కొనుగోలు దారులను లోపలకు రానీయకుండా ఇబ్బందులకు గురి చేశారు. దీంతో షాపింగ్‌మాల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు వారందరినీ చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అంతర్గత బదిలీలకు కసరత్తు పూర్తి

నగరపాలకసంస్థ: నగరపాలకసంస్థ విభాగాల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను స్థానచలనం చేసేందుకు కసరత్తు పూర్తయినట్లు తెలుస్తోంది. ఈమేరకు కమిషనర్ పి.శ్రీనివాసులు తుది జాబితాను ఒకటి, రెండు రోజుల్లోనే వెలువరించనున్నారు. కొందరు ఉద్యోగులపై ఒకే పోస్ట్‌లో దీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. కమిషనర్ ఛాంబర్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కూడా మార్చి వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తులను ఛాంబర్‌లో నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 44, వంగ 24, బెండ 19, పచ్చిమిర్చి 18, కాకర 24, క్యారెట్ 42, క్యాలిఫ్లవర్ 34, క్యాబేజీ 24, బీర 24, దొండ 34, బంగాళదుంప 38, ఉల్లిపాయలు 45, గోరుచిక్కుళ్లు 37, దోస 26, పొట్ల 29, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 36, చామదుంప 38, మునగ రూ.6, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 30, బీట్‌రూట్ 32, కీర 34, క్యాప్సికం 64, అల్లం 95, ఫ్రెంచి బీన్స్ 55, సొర 10, అరటి 7



-న్యూస్‌టుడే, పట్నంబజారు

చెత్త కుప్పలు తొలగింపు

స్పందనకు వందనం

సీతానగరం రెండోలైన్‌లో వీధుల్లో పరిసరాలు చెత్తకుప్పలతో నిండి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. విషయాన్ని ఎస్ఎస్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి చెత్త కుప్పలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

✦ యానాదికాలనీలో కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు పారుదల నిలిచిపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు మేమున్నాం.. మీకుతోడుగాకు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

– న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)



బస్టాండ్ ఎదురుగా విరిగిపడిపోయిన షెల్టర్



షెల్టర్లకు ఎదురుగా నిలిపిన వాహనాలు

బస్ షెల్టర్లు నిరుపయోగం.. ప్రయాణికులకు కష్టం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నగరంలో ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో షెల్టర్లు విరిగిపడినా పట్టించుకున్న నాథుడు లేడు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడడంలేదు. నగర వాసులతో పాటు వివిధ పనులపై గుంటూరు వచ్చే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఉంటారు. వీరు బస్టాండ్ వద్ద సిటీ బస్సులు ఎక్కి, తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. వీరంతా బస్సుల కోసం వేచి ఉండాలంటే రోడ్లపైన పడిగాపులు కాయాల్సి వస్తోంది. బస్టాండ్ ఎదురుగా సిటీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం మూడు షెల్టర్లు ఉండగా ఒకటి విరిగిపోయింది. రెండు నెలలు గడిచినా ఇంతవరకు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. మరో రెండు ఉన్నప్పటికీ వాటి అడ్డుగా ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. బస్సుల ఆలస్యం అయితే ప్రయాణికులు కాసేపు కూర్చోవటానికి అవకాశం లేకపోవడంతో వర్షం వచ్చినా, ఎండలు మండిపోతున్నా రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుంది. షెల్టర్ల ఎదుట ఆక్రమణలు తొలగించి అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగుల రక్తదానం



శిబిరం ప్రారంభోత్సవంలో డీఆర్ఎం రామకృష్ణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని డీఆర్ఎం రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛందంగా వందమంది రైల్వే ఉద్యోగులు ముందుకు వచ్చి రక్తదానంచేయడం ఆనందంగా ఉందన్నారు. పేద రోగులకు వైద్యం అందిస్తున్న జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌కు 100 యూనిట్ల రక్తం అందించడం అత్యవసర వైద్య సేవలకు తోడ్పడుతుందన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ డీపీవో హనూర్, మానవత బ్లడ్ డొనేషన్ కమిటి ఛైర్మన్ గురవారెడ్డి, జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, మానవత ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌లో సందడిగా దాండియా నైట్



దాండియా ఆడుతున్న మహిళలు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ గుంటూరు ప్రైడ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాండియా నైట్ వేడుక సందడిగా సాగింది. ఈ వేడుకలో వందల మంది మహిళలు కోలాటం, దాండియా, గుజరాతీ నృత్యం, మ్యూజిక్, తంబోలా తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు దీప్తి సందూరి, కార్యదర్శి దీప్తికా పొలిశెట్టి, కోశాధికారి ఎం.చందన నిర్వహించారు.

దేవీ శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు



మోతీలాల్‌నగర్‌లో విద్యుత్తు వెలుగుల్లో దుర్గాదేవి ప్రతిమ

నెహ్రూనగర్, పట్నంబజారు, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు నగరంలోని ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద ఉత్సవాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేయటానికి వీలుగా అందంగా మండపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్తు వెలుగుల్లో అమ్మవారి ప్రతిమలను అమర్చారు. ఆలయాలకు సమీపంలోని వీధులన్నీ రంగు రంగుల విద్యుత్తు కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

నగరంలో షీటీమ్స్ ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన అధికారులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని త్వరలో షీటీమ్స్ ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల వద్ద ఎటువంటి సమస్యలు తెలుసుకోని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు, కళాశాలల వద్ద సాధారణ దుస్తుల్లో, యూనిఫాంలో షీటీమ్స్‌ను ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాసంస్థల వద్ద తప్పనిసరిగా నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎస్పీలు జయరాం ప్రసాద్, అజీజ్, సీతారామయ్య, సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపు ప్రతిపాదన విరమించుకోండి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు, నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీలు పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. శంకర్‌విలాస్ కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంధన సర్‌ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై తీవ్రంగా బారాలు మోపిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంపుకు ప్రతిపాదనలు చేస్తుందని వాటిని విరమించుకోపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు నాయకులు నేతాజీ, భావన్నారాయణ, నళినీకాంత్, రవి, వెంకటేశ్వరరావు, నికల్సన్, కల్యాణి, పద్మ, కోటేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

దసరా సెలవుల్లో కళాశాలలు తెరవొద్దు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో కళాశాలలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, సమీర్ కోరారు. ఈ మేరకు ఆర్ఐఓ జబీర్‌కు తన కార్యాలయంలో వినతి పత్రం అందించారు. నాయకులు నవీన, పవన్ కుమార్ ఉన్నారు.

సీఎంవోహెచ్‌గా శోభారాణి బాధ్యతల స్వీకరణ

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్(సీఎంవోహెచ్)గా డాక్టర్ జి. శోభారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం కమిషనర్ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు.

ముందస్తు దసరా వేడుకలు



నవదుర్గల చిత్రపటాలకు నమస్కరిస్తున్న చిన్నారులు

నగరపాలక సంస్థ(గుంటూరు): చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల పట్ల సరైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని భాష్యం జడ్ ఈవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం భాష్యం బ్లూమ్స్‌లో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దసరా ప్రాముఖ్యత తెలియజేసి నవదుర్గల చిత్రపటాలు అలంకరించారు. ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న కౌన్సెలింగ్

గుంటూరు వైద్యం: వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి పదోన్నతిచ్చేందుకు ఈనెల 4న కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర ఉత్తర్వులు జారీ చేశారు.

విధుల్లో వీఆర్ఓ అంకితభావం

గర్భిణి పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న వీఆర్ఓ జ్యోతి, పక్కన సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే: నిండు గర్భిణిగా ఉండి ఒకటో తేదీ పింఛన్ల పంపిణీ చేసి తన వృత్తి ధర్మాన్ని చాటుకున్నారు ఓ సచివాలయ ఉద్యోగి. నగరంలోని 55వ డివిజన్‌లోని సచివాలయంలో ఎం.జ్యోతి వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె 9 నెలల గర్భిణి. ఆమె 1వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి తన పరిధిలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించారు. ఆమెతోపాటు 55వ డివిజన్ తెదేపా ఇన్‌ఛార్జి సౌపాటి రత్నం, క్లస్టర్ ఇన్‌ఛార్జి గోళ్ల ప్రభాకర్, కూటమి నాయకులు నాని, నరేష్, ఉప్పు శ్రీను, కిషోర్, వెంకటేష్, నవీన్ ఉన్నారు. గర్భిణిగా ఉండి వృత్తిధర్మం చాటుకున్న ఆమెను నాయకులు అభినందనలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా 4న

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇసుకను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్‌తో అక్టోబర్ 4న చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ పిలుపునిచ్చారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాయకులు సత్యనారాయణ, ఖాసింవలి, ఆదినికల్సన్, కె. శ్రీనివాసరావు, దీవెనరావు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం



డంపింగ్‌యార్డు వద్ద అధికారులతో కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో వ్యర్థాల నిర్వహణ అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. నాయుడుపేట డంపింగ్ యార్డు వద్ద మంగళవారం లెగసి వేస్ట్ ట్రీట్మెంట్ ప్లాంటును అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ. . డంపింగ్‌యార్డులో వ్యర్థాలను 2025, మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో తొలగించాలని ఆదేశించారు. ఈఈ కొండారెడ్డి, డీఈఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర సభలు జయప్రదం చేయాలి

నగరపాలకసంస్థ: ఈనెల 6, 7, 8 తేదీలో విజయనగరంలో జరగనున్న ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు తెలిపారు. నగరంపాలెం ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం మహాసభల గోడప్రతులను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వేళంగిణిరాజు, కె.నరసింహారావు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవడం బాబుకే సాధ్యం



ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: పేదల జీవితాల్లో వెలుగులు నింపడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎమ్మెల్యే నసీర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. నసీర్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన మాట మేరకు చంద్రబాబు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్నారు. తెదేపా నాయకులు ఎల్లావుల అశోక్, సూరే శ్రీనివాసరావు, పఠాన్ జమీర్, వంగర ఏడుకొండలు, కందుకూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఔదార్యం

ఎన్టీఆర్ సర్కిల్, పట్నంబజారు: వరద బాధితుల్ని ఆదుకొనేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. సంగడిగుంటలోని బాపూజీ కమిటీ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం మంగళవారం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు రూ.25వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా సేవల్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ దయ ఉంటే అన్నీ శుభాలే



ఉత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పట్నంబజారు: అమ్మ దయ ఉంటే అన్ని శుభాలే జరుగుతాయని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఏటుకూరురోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దాతల సాయంతో రూ.6.50లక్షలతో ఏర్పాటు చేసిన జనరేటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం దసరా మహోత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే నసీర్ ఆవిష్కరించి మాట్లాడారు. దసరా మహోత్సవాల్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వీరంటి వరప్రసాద్ బాబు, కోట శేషగిరిరి, కొనకళ్ళ సత్యం తదితరులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తన యజమానిపై కేసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంపాలేనికి చెందిన ఓ యువతికి తండ్రి చనిపోవడంతో తల్లి వద్ద ఉంటూ ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తూ జీవిస్తుంది. ఆమె పట్ల దుకాణ యజమాని కిరీటీ అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్వచ్ఛ సాధనలో అందరి భాగస్వామ్యం



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు, విద్యార్థులు

నగరపాలకసంస్థ: స్వచ్ఛ గుంటూరు సాధనలో యువత, ఉద్యోగులు, విద్యార్థులు అందరి భాగస్వామ్యం అవసరమని కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక టీజేపీఎస్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యకర్తలు, ఐటీసీ బంగారు భవిష్యత్తు ప్రాజెక్టు ప్రతినిధులు, విద్యార్థులు వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత ప్రతి ఒక్కరి నినాదం కావాలన్నారు. నగరవాసులు తమ ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రత బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి, శ్రీవాణి, చంద్రకళ, ఐటీసీ బంగారు భవిష్యత్తు, ఫినిష్ సొసైటీ ప్రోగ్రాం మేనేజరు నారాయణ, టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా సేవ ముగింపు నేడు

నగరపాలకసంస్థ: స్వచ్ఛతా హి సేవలో భాగంగా గత నెల 17 నుంచి చేస్తున్న కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నాయని కమిషనర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఉదయం 9.45 గంటలకు హిమనీ కూడలి వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించనున్నారు. 10 గంటలకు ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమంతోపాటు మొక్కలు నాటే కార్యక్రమాలు జరగనున్నాయి. 10.30 గంటలకు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కొత్త స్వీపింగ్ యంత్రాల ప్రారంభం, పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, పీపీఈ కిట్‌లు పంపిణీ చేయనున్నారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో నిబద్ధతతో పాల్గొన్న కార్మికులకు సత్కారం చేయనున్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ ఉంటుందని తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారని తెలిపారు.

సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: సైన్స్ ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగరస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆదిమానవుడు నిప్పు, చక్రం కనుగొన్నాడని.. నేడు మనం ఉపయోగిస్తున్న ప్రతి వస్తువు శాస్త్రవేత్తల కృషి వల్ల వచ్చినవేనన్నారు. విద్యార్థులంతా సైన్స్ పట్ల ఆసక్తని పెంచుకోవాలని సూచించారు. వర్ధని సైన్స్ సంబరాల్లో వివిధ పాఠశాలల నుంచి 70 విద్యార్థుల బృందాలు పాల్గొన్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కాటూరి పబ్లిక్ స్కూల్, కొండవీడు పబ్లిక్ స్కూల్, విజేత పబ్లిక్ స్కూల్(అన్నపూర్ణనగర్), ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చేబ్రోలు స్తంభాలగురువు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక హైస్కూల్, కొత్తపేట జలగం రామారావు హైస్కూల్, ఆర్.అగ్రహారం కావటి శంకరరావు హైస్కూల్ విద్యార్థులు మొదటి మూడు స్థానాలు సాధించారన్నారు. కాలేజీ డైరెక్టర్ గ్రంధి స్వామి గుప్త, బి.ప్రసాద్, జి.వెంకటరావు, టీఆర్.రమేష్, ఈ.అనిల్‌కుమార్, బి.శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించుకుని వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవడం మనందరి బాధ్యత అని జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన క్విజ్ పోటీలను లక్ష్మణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ వారసత్వంను గౌరవించటం, స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవటం కోసం ఐక్యంగా కృషి చేద్దామన్నారు. అనంతరం పర్యావరణ క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహమ్మద్ నజీనా బేగం, పర్యావరణ నోడల్ అధికారి తిరపతిరెడ్డి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోస్నకుమారి, మున్సిపల్ హెల్త్ ఇంజినీరు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

డీఐవో సుబ్బరాజు బదిలీ

గుంటూరు వైద్యం: వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేస్తున్న కేవీ సుబ్బరాజును కాకినాడకు బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలపై నిషేధం ఉన్నందున ప్రత్యేక జీవో విడుదల చేశారు.

ఆటోనగర్‌లో అభివృద్ధికి నోచని రోడ్లు



రైల్వేగేటు శివారులో రోడ్డు ఇలా..

ఆటోనగర్, న్యూస్‌టుడే: గుంటూరు ఆటోనగర్‌లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా ఇంకా కొన్ని మట్టి రోడ్లుగానే ఉన్నాయి. ముఖ్యంగా ఫేజ్ 1, 2లలో అత్యధికం అధ్వానంగా ఉన్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లు జీవితం ఆదర్శం

గుంటూరు సాంస్కృతికం: తెలుగు చలనచిత్ర జగత్తులో అల్లు రామలింగయ్య జీవితం ఆదర్శప్రాయమని అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండెం శివప్రసాద్ అన్నారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అల్లు రామలింగయ్య జయంతి వేడుకలు పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రామలింగయ్య తన నటనా కౌశలంతో తెలుగు వారి ఖ్యాతిని దశదిశలా చాటారన్నారు.

గుంటూరు పశ్చిమ

15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో స్వచ్ఛతా పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల రైల్వే అధికారి రామకృష్ణ సూచించారు. ఇందులో భాగంగా మంగళవారం రైల్ వికాస్ భవన్‌లో ఉద్యోగులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించిన అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాల్లో ఉద్యోగులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ధర వరలు



కృష్ణనగర్ రైతు బజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 53, వంగ 28, బెండ 25, పచ్చిమిర్చి 22, కాకర 48, క్యారెట్ 40, బీర 44, క్యాబేజి 24, దొండ 32, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 52, గోరుచిక్కుళ్లు 32, దోస 25, సొర 20, పొట్లకాయ 30, అరటికాయ 7, బీట్‌రూట్ 29, క్యాప్సికం 60, బీన్స్ 64, కీరదోసకాయ 29, కొత్తిమీర 30, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 50, అల్లం 70, వెల్లుల్లి 320.

- పట్టాభిపురం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

? కొబాల్ట్‌పేట 5వ లైన్‌లోని వీధి దీపం(84తి/8) కొన్ని రోజులుగా వెలగడం లేదు. రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. మరమ్మతులు చేయించాలి. - స్థానికులు, కొబాల్ట్‌పేట

✔ దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - రవికిరణ్, ఏఈ

చెట్ల కొమ్మలు తొలగింపు: ఆకులవారితోట సమీపంలో విరిగిన చెట్ల కొమ్మలు పీకలవాగులో పడి మురుగు నీటి పారుదలకు అడ్డంకిగా మారాయి. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్‌కు తెలిపాం. ఆయన 85 సచివాలయ శానిటరీ కార్యదర్శి జబీరుల్ల పర్విన్, పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కొమ్మలు తొలగించారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

స్పందనకు వందనం

డీఐవో సుబ్బరాజు బదిలీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేస్తున్న కేవీ సుబ్బరాజును కాకినాడకు బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలపై నిషేధం ఉన్నందున ప్రత్యేక జీవో విడుదల చేశారు.

4న కౌన్సెలింగ్

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి పదోన్నతి కల్పించేందుకు ఈనెల 4న కౌన్సెలింగ్ ఏర్పాటు చేస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి ఇవ్వనున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు నగరం సిద్ధం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య చెప్పారు. విద్యానగర్ శివాలయంలో శ్రీసాయినాథ సన్నిధానం, శ్రీకామాక్షి పీఠ మారుతి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి జరుగుతాయని ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్ కుమార్, ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాసరావు తెలిపారు.

కొత్త ఆట ఆడదాం.. రండి

గుంటూరులో పికిల్‌బాల్ టోర్నీకి ఆదరణ

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే

పికిల్‌బాల్.. పేరు వినగానే ఇదేమిటి అనుకుంటున్నారా.. ఇదొక ఆట. మనకు ఇది కొత్త. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఈ ఆట ఎంతో వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. కొవిడ్ తర్వాత దేశంలో కొన్ని నగరాల్లో బాగా ఆడుతున్నారు. సినీతారలు ఈ క్రీడతో సేద తీరుతున్నారు. దీంతో ఈ ఆటపై ఇష్టం పెరుగుతోంది. రాబోయే రోజుల్లో ఐపీఎల్ తరహాలో పికిల్‌బాల్ పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని వీవీవీ హెల్త్‌హబ్ కోర్టు వేదికగా మొదటిసారిగా రాష్ట్ర స్థాయి పికిల్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఆరోగ్యానికి దోహదపడే వ్యాయామ క్రీడగా భావిస్తుండడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు. దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఈ ఆట గురించి తెలుసుకుందాం.



పికిల్‌బాల్ ఆడుతున్న ఆటగాళ్లు

మన గుంటూరులో..

రాష్ట్ర స్థాయి పోటీలను వీవీవీ హెల్త్ హబ్ అధ్యక్షుడు పి.అరుణ్‌కుమార్ గుంటూరులో ప్రారంభించారు. కార్యక్రమంలో పికిల్‌బాల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీధర్, సభ్యులు హాజరయ్యారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని కోర్టులో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి ఆటగాళ్లు వచ్చారు. అండర్-14, 35+, 50+, ఓపెన్ విభాగాల్లో పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ ఆటను చూడడానికి క్రీడాభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా భారీగా వచ్చారంటే మన నగరవాసులకు ఆసక్తి పెరుగుతోందని చెప్పొచ్చు. రాబోయే రోజుల్లో మరిన్ని పోటీలు గుంటూరు వేదికగా నిర్వహించే అవకాశముంది. దీనిపై వైద్యులు సైతం ఆసక్తి చూపడం విశేషం.


టెన్నిస్, టేబుల్ టెన్నిస్, షటిల్ సమ్మిళితం..



ఆటకు సంబంధించిన బ్యాట్లు, బంతులు

షటిల్ బ్యాడ్మింటన్, సంప్రదాయ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ మేళవింపు ఈ పికిల్‌బాల్. మిగతా ఆటలతో పోలిస్తే గాయాల సమస్య తక్కువ. అన్ని వయసుల వారికి అనుకూలం. వేగంలో మాత్రం షటిల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్‌లకు ఏమాత్రం తీసిపోదు. ఆటకయ్యే ఖర్చుతో పాటు కోర్టు పరిమాణం కూడా చాలా తక్కువ. కోర్టు పరిమాణం 40×22 అడుగులు. బ్యాటు ధర రూ.1500 నుంచి రూ.20 వేల మధ్య ఉంటుంది. కానీ ఎక్కువ కాలం మన్నిక ఉంటుంది. బాల్ కూడా రూ.100 నుంచి 200 మధ్య ఉంటుంది. స్కోరు కూడా 11, 15, 21 పాయింట్లకు ఉంటాయి. ఒక్కో సర్వీస్ గెలిస్తే 2 పాయింట్లు వస్తాయి. అంతిమంగా గెలవడానికి ఇద్దరు ఆటగాళ్ల మధ్య కనీసం రెండు పాయింట్ల అంతరం ఉండాలి. సుమారుగా అరగంటలో ఆట పూర్తవుతుంది.

విజేతగా నిలిచా: జి.దుష్యాంత్, అరండల్‌పేట



దిల్లీ పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాను. పాఠశాల స్థాయిలో రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలకు వెళ్లాను. టెన్నిస్‌లాగే ఉండే ఆటని కోచ్ ఆనంద్‌కుమార్ చెప్పడంతో పోటీలకు హాజరయ్యాను. దీనికోసం కొంత సాధన చేశాను. అండర్-14 విభాగంలో విజేతగా నిలిచాను. ఈ ఆట చాలా ఉత్కంఠగా సాగింది. పాఠశాల, కళాశాల స్థాయుల్లో పికిల్‌బాల్ ఆట ప్రవేశపెడితే బాగుంటుంది.

స్వాతంత్ర్యోద్యమం పుస్తకావిష్కరణ



డాక్టర్ సి.ఎస్.రావు రచించిన ఫ్రీడమ్ ఫైట్ పుస్తకాన్ని మంగళవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆమె ఛాంబర్‌లో ఆవిష్కరించారు. పుస్తకాన్ని గురించి వివరిస్తూ స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యక్తిగత హక్కుగా మార్చడానికి చేసిన ప్రయత్నమే ఫ్రీడమ్ ఫైట్ పుస్తకమని తెలిపారు. కార్యక్రమంలో ముంజుపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, కలెక్టరేట్(గుంటూరు)

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, వేదికపై ఆలపాటి రాజేంద్రప్రసాద్, కోవెలమూడి రవీంద్ర

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'గత ఎన్నికల్లో ఎన్నో ఒడుదొడుకుల్ని ఎదుర్కొని ఒక నియంతపై విజయం సాధించాం. అదే స్ఫూర్తితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధించాలి'.. అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. తెదేపా జిల్లా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 'త్వరలో గుంటూరు-కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి. ఓటరుగా నమోదు కావడానికి నెల రోజులే ఉంది. డివిజన్ల వారీగా ఓటరు నమోదు నిర్వహిస్తాం. ప్రతి డివిజన్‌లో అధికంగా ఓట్లను చేర్పించాలి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే అధికంగా పట్టభద్రులు ఉన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గత ఎన్నికల్లో నన్ను ఏవిధంగా అధిక మెజార్టీతో గెలిపించారో.. అదేవిధంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలి. త్వరలో తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభం కాబోతుంది. పశ్చిమ నియోజకవర్గం నుంచి లక్ష సభ్యత్వం చేయించాలి'.. అని పేర్కొన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టభద్రులందరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. సందేహాలున్నా పశ్చిమ నియోజకవర్గంలోని తెదేపా కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. త్వరలో ఎక్కడికక్కడ ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. జోన్-5 ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అఖండ విజయం సాధించేలా అందరూ పని చేయాలన్నారు. తెదేపా నాయకులు పిల్లి మాణిక్యరావు, మద్దిరాల మ్యాని, కుసుకుర్తి హనుమంతురావు, సుఖవాసి శ్రీనివాసరావు, షేక్ లాల్‌వజీర్, ముత్తినేని రాజేష్, వేములపల్లి శ్రీరాంప్రసాద్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, పద్మశ్రీ పాల్గొన్నారు.

అల్లు రామలింగయ్య జీవితం ఆదర్శప్రాయం

గుంటూరు సాంస్కృతికం: తెలుగు చలనచిత్ర జగత్తులో అల్లు రామలింగయ్య జీవితం ఆదర్శప్రాయమని అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండెం శివప్రసాద్ అన్నారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అల్లు రామలింగయ్య జయంతి వేడుకలు పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. పరిషత్ ఉపాధ్యక్షుడు రేజేటి రామకృష్ణ, కార్యదర్శి దళవాయి సుబ్రహ్మణ్యం, కోశాధికారి తట్టల శ్రీనివాసరావు, స్టే రమేష్, హరీష్, ఆమంచి, డేగల పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతో వాతావరణ సమతుల్యం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: మొక్కలను నాటి.. వాటిని సంరక్షించడం ద్వారా వాతావరణం సమతుల్యత సాధించేలా చూడవచ్చని పొగాకు బోర్డు విస్తరణ విభాగం మేనేజర్ జి.దామోదర్ అన్నారు. నగరంలోని పొగాకు రైతు భవన్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు విభాగాల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రితో జడ్పీ ఛైర్‌పర్సన్ భేటీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఆమె భర్త సురేష్‌కుమార్ రాష్ట్ర సచివాలయం వెలగపూడిలో మంగళవారం కలిశారు. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

రక్తదానం సామాజిక బాధ్యత

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతులందరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని మండల రైల్వే అధికారి రామకృష్ణ సూచించారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా రైల్ వికాస్ భవన్‌లోని అమరావతి ఎనెక్స్‌లో మంగళవారం మానవత స్వచ్ఛాంధ్ర సంస్థ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జీజీహెచ్‌లో రక్తం డిమాండ్ మేర అందుబాటులో లేదనే విషయాన్ని తెలుసుకుని రైల్వే ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇకనుంచి ఏటా నిర్వహించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి, సీఎంఎస్ శ్రీనివాస్, మానవత స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు

వేళ్లూనుకున్న నిర్లక్ష్యం..!

శిథిల స్థితిలో పోలీసు క్వార్టర్లు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే



విద్యానగర్‌లో పోలీస్ నివాస భవనాలపైకి పాకిన వృక్షం వేర్లు

విద్యానగర్‌లోని పోలీసు క్వార్టర్లు నిర్వహణా లోపంతో కునారిల్లుతున్నాయి. శిథిలావస్థకు చేరుతున్నాయి. అరండల్‌పేటలో క్వార్టర్లు పూర్తిగా శిథిలం కావడంతో వినియోగించకుండా వదిలేశారు. విద్యానగర్‌లోని పోలీస్ నివాస భవనాలపై వృక్షాల వేర్లు పాకిన పరిస్థితి. భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెద్దఎత్తున పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. బూత్ బంగ్లాల్లా మారాయి. వాటిని పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల నివాసాలు ఉంటున్న ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. పక్క గృహాల్లోకి దోమలతోపాటు విషపురుగులు, పాముల వంటివి వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. జీఎంసీ అధికారులు కూడా ఆ భవనాల బాగు గురించి చర్యలు తీసుకోవాలని ఇప్పటి వరకు ఆ శాఖ అధికారులకు కనీసం తెలియజేసిన పరిస్థితి లేదు. ఉన్నతాధికారులు స్పందించి శిథిల భవనాలను పూర్తిగా తొలగించి ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛత నెలకొనేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పోలీస్ క్వార్టర్ల మధ్య చిట్టడవిలా పెరిగిన పిచ్చిమొక్కలు

పింఛనర్ల డిమాండ్లు నెరవేర్చాలి



నినాదాలు చేస్తున్న పింఛనర్లు

గుంటూరు సాంస్కృతికం: పింఛనర్ల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) శాఖకు చెందిన రాష్ట్ర పింఛనర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ పింఛనర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం బృందావన గార్డెన్స్‌లోని అన్నమయ్య భవన్‌లో సీబీఐసీ రాష్ట్ర పింఛనర్లు సమావేశమయ్యారు. సంఘ నాయకులు మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని, కొవిడ్ సందర్భంగా ఆపివేసిన డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఆదాయపు పన్నును పింఛనర్లకు పూర్తిగా రద్దు చేయాలని, 65 ఏళ్లు దాటితే అదనపు పింఛను ఇవ్వాలని కోరారు. జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన వారికి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్, ఈసీ సభ్యులు రాజేశ్వరరావు, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, కోటేశ్వరరావు, సామ్రాజ్యం, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిస్ట్ మధు కన్నుమూత



గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అయిదు దశాబ్దాల పాటు ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిస్ట్‌గా సేవలందించిన మధు (80) అనారోగ్యంతో మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన పాత్రికేయ వృత్తిలో సుపరిచితుడు. జై ఆంధ్ర, సమైక్యాంధ్ర ఉద్యమాల్లో ఫొటో జర్నలిస్ట్‌గా చురుగ్గా పని చేశారు. రాష్ట్ర కృష్ణంరాజు సాంస్కృతిక సంఘ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. గుంటూరుకు సినీ తారలు ఎవరొచ్చినా అప్పట్లో ఆయనే ఛాయాచిత్రాలు తీసేవారు. మధు మృతికి ఆలిండియా కృష్ణంరాజు అభిమాన సంఘాల అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీరామచంద్రశాస్త్రి, అక్కినేని అభిమాన సంస్థల అధ్యక్షుడు పరమాత్ముని సూరిబాబు, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు పుల్లా సుందరంబాబు, కృష్ణ సేన అధ్యక్షుడు పర్వేజ్ చిష్టి, గుమ్మడి సీతారామయ్య చౌదరి, బ్రాహ్మణ సేవా సంఘం, ఫొటోగ్రాఫర్ల సంఘం 'పట్వా' నిర్వాహకులు సంతాపాలు ప్రకటించారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ప్రదర్శన



సమాచార ప్రపంచంలో గట్టిపోటీని ఎదుర్కొని, ఒడుదొడుకులు దాటి బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తోందని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ సప్పరపు శ్రీధర్ తెలిపారు. చంద్రమౌళినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు మంగళవారం నిర్వహించారు. దేశంలో బీఎస్ఎన్ఎల్ ప్రారంభమై 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నగరంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

అలరించిన సంగీత విభావరి


గుంటూరు సాంస్కృతికం: బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి జరిగిన వాగ్గేయకార సంగీత విభావరి ఆకట్టుకుంది. శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు రామరాజు ప్రేమకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత వేణునాద కచేరీలో వి.కృష్ణకిశోర్, శశాంక్ వేణునాదంతో అన్నమయ్య తదితర వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించి అలరించారు. అనంతరం వైఎస్ రాజ్యలక్ష్మి గాత్ర కచేరీ జరిగింది.

వైభవంగా మాస శివరాత్రి

గుంటూరు సాంస్కృతికం: బృందావన గార్డెన్స్ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో భాద్రపద మాస శివరాత్రి ఉత్సవాలు మంగళవారం జరిగాయి. చండి, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లు జగన్ అవలంబించిన అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ లెక్క చేయకుండా ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తూ పేదల సంక్షేమం చేపట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయిస్తూ ఇంటికి పెద్ద కుమారుడిలా ఆదుకుంటున్నారన్నారు. ఇదే స్ఫూర్తి అయిదేళ్లు కొనసాగిస్తామన్నారు. తెదేపా నాయకులు వేములపల్లి శ్రీరాంప్రసాద్, సింగంశెట్టి వీరయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

స్వచ్ఛత అనేది నడవడికవ్వాలి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛత అనేది అందరి నడవడిక అవ్వాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం మంగళవారం కృష్ణనగర్‌లోని సీజీజీబీ బ్రాంచిలో జరిగింది. ఈసందర్భంగా 70 మంది పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నిత్యం విధుల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు ఎంతో సేవ చేస్తున్నారన్నారు. రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ శానిటర్ వర్కర్స్ గొప్ప సంఘ సేవకులన్నారు. బ్రాంచి మేనేజర్ నరేంద్ర మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం కార్మికులు వారి ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండీ డాక్టర్ రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు.. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

రోటరీ క్లబ్‌లో సందడిగా దాండియా నైట్

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ గుంటూరు ప్రేరణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాండియా నైట్ వేడుక సందడిగా సాగింది. ఈ వేడుకలో వందల మంది మహిళలు కోలాటం, దాండియా, గుజరాతి నృత్యం, మ్యూజిక్, తంబాలా తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షురాలు దీప్తి నందమూరి, కార్యదర్శి దీప్తికా పొలిశెట్టి, కోశాధికారి ఎం.చందన నిర్వహించారు.



దాండియా ఆడుతున్న మహిళలు

విద్యానగర్‌లో గొలుసు చోరీ

విద్యానగర్, న్యూస్‌టుడే: విద్యానగర్‌లో గొలుసు చోరీ జరిగింది. ఒకటో లైనులోని రామకృష్ణ టవర్స్‌లో నివాసం ఉంటున్న లక్ష్మీభవాని తన కుమార్తె లహరిని తీసుకొని సమీపంలోని పార్కుకు వాకింగ్ వెళ్లి వస్తున్నారు. ఒకటో అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి లహరి బూట్ల లేస్ తెగిపోవడంతో కట్టుకుంటుంది. ఇది గమనించిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై రాగా.. వెనుక కూర్చున్న మహిళ లహరి మెడలోని బంగారు గొలుసును తెంచుకుని ఇద్దరూ పరారయ్యారు. 16 గ్రాముల బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు లక్ష్మీభవాని పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉన్నతమైన ఆలోచనలతో ప్రగతి

జిల్లాపరిషత్తు: పాఠశాల విద్య దశలో ఉన్నతమైన ఆలోచనలు కలిగినపుడే ప్రగతి బాటలో నడుస్తారని కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు కె.శ్రీధర్‌బాబు అన్నారు. పెదపలకలూరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై జిల్లా యువజన సేవలు, స్టెప్ ఆధ్వర్యంలో సదస్సు మంగళవారం జరిగింది.

అసభ్య ప్రవర్తన.. యజమానిపై కేసు

గుంటూరు నేరవార్తలు: యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంపాలేనికి చెందిన ఓ యువతికి తండ్రి చనిపోవడంతో తల్లి వద్ద ఉంటూ ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తుంది. ఆమె పట్ల దుకాణ యజమాని కిరీటి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పథకాలన్నీ అర్హులకు చేరువయ్యేలా కృషి



సభ్యత్వ నమోదులో రవికుమార్, అంబేడ్కర్

ఏటి అగ్రహారం, న్యూస్‌టుడే: అరండల్‌పేట 15వ లైన్‌లోని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సభ్యత్వ పరిశీలకుడు పాలపాటి రవికుమార్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మోదీ జన్మదినం పురస్కరించుకొని సేవ పట్వాడా కార్యక్రమంలో భాగంగా పేదలకు కూరగాయలు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చెరుకూరు తిరుపతిరావు, చరక కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు భగవాన్‌దాస్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, జల్లి మోహన్, జిల్లా ఆర్టీఐ సెల్ కన్వీనర్, బూసి స్టాలిన్‌బాబు, కొరివి నాగరాజు, రమణ, దుర్గ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలు తెలపండి

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి అన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని కృషి భవన్‌లో మంగళవారం ప్రకృతి వ్యవసాయం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డీపీఎం రాజకుమారి మాట్లాడుతూ రైతుకు ఆదాయం వచ్చే నమూనాలను ప్రతి ప్రకృతి వ్యవసాయ గ్రామంలో వేయించాలన్నారు.

మద్యం దుకాణాలకు తొలిరోజు 200 దరఖాస్తులు



- అడ్డొచ్చిన అమావాస్య సెంటిమెంట్
- మొత్తం లక్షకు పైగా అర్జీలు రావొచ్చని అంచనా
- నాన్ రీఫండబుల్ రుసుముల రూపేణా రూ.2 వేల కోట్ల ఆదాయం!
- ఆన్‌లైన్‌లో అర్జీల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా, తొలిరోజైన మంగళవారం 200కు పైగా వచ్చాయి. వీటిలో ఆఫ్‌లైన్ విధానంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొత్తంగా లక్షకు పైగా దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుముల రూపంలోనే దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. 2017లో 4,380 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఒక్కో దానికి సగటున 18 చొప్పున మొత్తంగా 78 వేల దరఖాస్తులు అందాయి. ఈసారి 3,396 దుకాణాలకుగానూ ఒక్కో దానికి సగటున 30 వరకు దరఖాస్తులు పడతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9 వరకు గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో అయితే..

మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెబ్ పోర్టల్ తీసుకొచ్చింది. hpfsproject.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్‌నంబర్‌నే యూజర్ ఐడీగా వినియోగించుకొని, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన సమగ్ర యూజర్ మాన్యువల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తు విధానానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు.

విశాఖలో గరిష్ఠం

ఎక్సైజ్ శాఖ నోటిపై చేసిన 3,396 దుకాణాల్లో 2,261 (66.57 శాతం) మండలాల్లోనే ఏర్పాటు చేయనుంది. నగరపాలక సంస్థల పరిధిలో 511, పురపాలక సంఘాల్లో 499, నగర పంచాయతీల్లో 125 చొప్పున నోటిఫై చేసింది. అత్యధికంగా విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 136, గుంటూరులో 52 చొప్పున ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా తిరుపతిలో 227, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 40 దుకాణాలను నోటిఫై చేసింది.

అందుబాటులో కోరుకున్న మద్యం బ్రాండ్లు

నూతన మద్యం విధానంలో భాగంగా దుకాణాల్లో నేషనల్, మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులో ఉంచనుంది. వినియోగదారులు కోరుకునే బ్రాండ్లన్నీ విక్రయిస్తారు. సరఫరా కంపెనీల నుంచి మద్యం కొనుగోలు కోసం చెల్లించే బేసిక్ ప్రైస్ (మూల ధర)ను చెల్లించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయనుంది. 90 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్యంపై 10 రకాల పన్నులు విధిస్తుండగా, తాజా విధానంలో వాటిని ఆరుకు కుదించారు. ఎక్సైజ్ డ్యూటీ, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం, రౌండింగ్ ఆఫ్ పన్నులు ఉంటాయి.

జిల్లాల వారీగా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాల సంఖ్య

జిల్లా	దుకాణాలు
శ్రీకాకుళం	158
విజయనగరం	153
పార్వతీపురం మన్యం	52
అల్లూరి సీతారామరాజు	40
విశాఖపట్నం	155
అనకాపల్లి	136
కాకినాడ	155
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	133
తూర్పుగోదావరి	125
పశ్చిమగోదావరి	175
ఏలూరు	144
కృష్ణా	123
ఎన్టీఆర్	113
గుంటూరు	127
బాపట్ల	117
పల్నాడు	129
ప్రకాశం	171
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	182
కర్నూలు	99
నంద్యాల	105
అనంతపురం	136
శ్రీసత్యసాయి	87
వైఎస్సార్	139
అన్నమయ్య	111
చిత్తూరు	104
తిరుపతి	227

పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ఓకే

నదీగర్భంలో జిల్లా ఇసుక కమిటీ ద్వారా తవ్వకాలు

పట్టాదారుకు టన్నుకు రూ.60 చొప్పున చెల్లింపు

నదీగర్భం బయట పట్టాదారే తవ్వి, విక్రయించేందుకు అవకాశం

గరిష్ఠంగా టన్ను రూ.250కి మించి అమ్మకూడదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నదీగర్భంలో, నదిని ఆనుకొని ఉన్న పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక కొరతను తీర్చేందుకు ఆయా భూముల్లో మేటవేసిన ఇసుకను తవ్వి, విక్రయించేందుకు అవకాశం కల్పించింది. నదీగర్భం లోపల ఉండే భూముల్లోని ఇసుకను జిల్లాస్థాయి ఇసుక కమిటీ ద్వారా తవ్వి విక్రయించనుండగా, నదీగర్భం బయట ఉండే భూముల్లో నేరుగా పట్టాదారే తవ్వుకునేందుకు వీలు కల్పించారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు మూడు రకాలుగా వీలు కల్పించారు.



పట్టాదారుకు ఇలా..

■ నదీగర్భం లోపల భూముల్లో ఇసుక మేటలు ఉంటే.. పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ అందజేయాలి. అందులో ఇసుక తవ్వకాలకు అంగీకరిస్తున్నట్లు పేర్కొనాలి.

■ వీటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, భూగర్భజలశాఖ అధికారి, జలవనరులశాఖ ఈఈ, జిల్లా గనులశాఖ అధికారితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తుంది.

■ తర్వాత ఈ భూముల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ ప్లాన్, పర్యావరణ, పీసీబీ అనుమతులను కలెక్టర్ పేరుతో జిల్లా గనులశాఖ అధికారి తీసుకుంటారు. ఈ ఫీజులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

■ అనుమతులు వచ్చాక, పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత ఈ కమిటీ ద్వారా ఇసుక తవ్విస్తారు. ఇలా తవ్విన ఇసుకలో టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు.

■ ఈ ఇసుక నిల్వలను శాండ్ పోర్టల్లో చూపించి, ఆన్‌లైన్ బుకింగ్‌తో విక్రయిస్తారు.

ప్రభుత్వ పనులకే..

■ నదీగర్భం బయట ఉన్న భూముల్లో.. గతంలో వరదల వల్ల ఇసుక మేటలు వేసి, మున్ముందు వరదలతో ఇసుక వచ్చే అవకాశం లేని భూముల్లో జిల్లా ఇసుక కమిటీ ద్వారానే తవ్వకాలు జరుపుతారు. ఇలాంటి ప్రాంతాల్లో తవ్వకాలకు అనుమతులన్నీ జిల్లా గనులశాఖ అధికారులే తీసుకుంటారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులలోనే వినియోగిస్తారు.

అనుమతులు తెచ్చుకోవాల్సింది పట్టాదారే

■ నదీగర్భం బయట భూముల్లో గతంలో వరదలతో ఇసుక మేటలు ఏర్పడి, మళ్లీ భవిష్యత్‌లో వరదల వల్ల ఇసుక వచ్చే అవకాశం ఉన్నచోట్ల.. పట్టాదారే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతిస్తారు. అయితే వీటికి 5 కి.మీ. పరిధిలో ప్రభుత్వ రీచ్‌లు గానీ, పూడిక రూపంలో ఇసుక తవ్వే పాయింట్లు గానీ ఉండకూడదు. ■ పట్టాదారు దరఖాస్తు చేసుకుంటే, ఆయా శాఖల అధికారుల బృందం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీకి నివేదిక ఇచ్చాక, అది అనుమతిస్తుంది. ■ తర్వాత పట్టాదారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ■ అనంతరం పట్టాదారు తన భూమిలో ఇసుక తవ్వి, గనులశాఖ పోర్టల్ ద్వారా టన్ను రూ.250కి విక్రయించాలి. ఇందులో టన్నుకు రూ.88 సీనరేజి కింద మినహాయిస్తారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు

- విజయవాడలో ఇక రూ.1,918

ఈనాడు వాణిజ్య విభాగం: రెస్టారెంట్లలో, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను ఈ నెల 1 నుంచి (మంగళవారం) పెంచినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.1919 నుంచి రూ.48 పెరిగి రూ.1967కు చేరింది. విజయవాడలో రూ.1,870 నుంచి రూ.48 అధికమై రూ.1,918కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సిలిండర్ ధరను ఆగస్టు, సెప్టెంబరులలో కూడా పెంచారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా వీటి ధరలను కంపెనీలు సవరిస్తుంటాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో మార్పులేమీ చేయలేదు.

పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదార

- రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచే మొదలైన పంపిణీ


రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార పంపిణీ 16 నెలల తర్వాత మళ్లీ మొదలైంది. దసరాకు ముందే రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది జూన్ నుంచి కందిపప్పు పంపిణీ నిలిపివేయడంతో అప్పటి నుంచి కార్డుదారులు కిలో రూ.170కు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక కందిపప్పు పంపిణీపై దృష్టి పెట్టింది. మూడు నెలల పాటు సరఫరా చేసేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచారు. ఇటీవలే ఖరారు చేసి అక్టోబరు నుంచి కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. సరఫరాలో జాప్యం కారణంగా కొన్ని జిల్లాలకు కందిపప్పు నిల్వలు ఆలస్యంగా చేరినా.. మిగతాచోట్ల మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

వైకాపా హయాంలో కిలో కోత పెట్టి..

2019 వరకు రేషన్ కార్డుదారులకు రాయితీపై కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పు ఇచ్చేవారు. వైకాపా రావడంతోనే కోత పెట్టి కేవలం కిలో చొప్పున పంపిణీ చేసింది. 2020 ఏప్రిల్ నుంచి కిలో ధర రూ.67కు పెంచింది. అయినా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేదు. ప్రతి నెలా మొత్తం కార్డుల్లో 25% నుంచి 35% మందికి మాత్రమే పప్పు అందేది. 2021 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు చూస్తే సగటున 30% కుటుంబాలకే కందిపప్పు ఇచ్చారు. జూన్ నుంచి పంపిణీ నిలిపివేశారు. ప్రతి నెలా ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతున్నా పట్టించుకోలేదు.

జనవరి నుంచి తృణధాన్యాల పంపిణీకి ప్రణాళికలు: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందిస్తామని.. వచ్చే ఏడాది జనవరి నుంచి తృణధాన్యాలు కూడా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన కార్డుదారులకు రాయితీపై కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఎందుకా విజ్ఞానం?

మంచి వ్యక్తిత్వం లేనివారికి ఎంతటి విజ్ఞానం ఉన్నా అది దుష్ట శక్తి కిందే లెక్క. మనం ప్రపంచంలో తరచూ చూస్తుండే 'మహా తెలివైన దొంగలు', 'పెద్దమనుషుల్లాంటి వంచకులు' ఈ కోవలోని వారే!

– మహాత్మా గాంధీ



గత ఐదేళ్లు నిర్మాణాల చుట్టూ ముళ్లకంపలతో అడవిని తలపించేలా..



కూటమి ప్రభుత్వం ముళ్లపొదలు తొలగించాక..

పార్కు... ఇదీ వైకాపా మార్కు!

దేశంలోనే ఆదర్శవంతమైన.. పర్యావరణహితమైన భారీ ఉద్యానవనమిది.. అప్పటి తెదేపా ప్రభుత్వం రాజధాని అమరావతి ప్రాంతంలోని శాఖమూరు వద్ద 300 ఎకరాల్లో అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో తలపెట్టింది. సరిగ్గా ఇది రాజధాని నగరం మధ్యలో ఉంది. మన రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల పర్యాటకులనూ ఆకట్టుకునేలా దీనికి రూపకల్పన చేసింది. పలు దేశాల్లోని ఉద్యానవనాలను పరిశీలించి దీని నిర్మాణాన్ని ప్రారంభించింది. మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే కళాఖండాలను అమర్చింది. 2019లో చీకటి పాలన మొదలయ్యాక ఈ ఉద్యానవనమూ కళ తప్పింది. ఐదేళ్లలో అదొక అడవిలా మారిపోయింది. కట్టడాలు కుంగిపోయాయి. కళాఖండాలు రంగు కోల్పోయి కళావిహీనంగా మారాయి. చాలావరకు శిథిలమయ్యాయి. ఇటీవల తెదేపా కూటమి అధికారంలోకి వచ్చాక ఈ ముళ్లకంపలన్నింటినీ తొలగించడంతో పార్కు రూపు బయటపడింది. -ఈనాడు, అమరావతి



కొన్ని కిందపడి శిథిలమై..



రంగుమారి, రూపుకోల్పోయిన కళాఖండాలు

మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



మహిళ సమస్య తెలుసుకుంటున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరించారు. అందరినీ మంత్రి ఆప్యాయంగా పలకరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ప్రకాశం జిల్లా కంభం మండలం కుందలాపురంలో తమ కుటుంబానికి చెందిన 1.9 ఎకరాల పట్టా భూమిని గత వైకాపా ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో గ్రామ కంఠంగా నమోదు చేశారని మార్కాపురానికి చెందిన రాచకుండా లక్ష్మీదేవి, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం కునింపూడిలో తన తండ్రికి చెందిన 1.95 ఎకరాల భూమిని తప్పుడు పత్రాలతో నాగవెంకట సత్యనారాయణ కబ్జా చేశారని ఏలూరు జిల్లాకు చెందిన ఆదినాగు వినతులు ఇచ్చారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, తాత్కాలిక, అకడమిక్ కన్సల్టెంట్ విధానాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేసి క్రమబద్ధీకరించాలని రాజమహేంద్రవరానికి చెందిన అడహాక్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ఉపాధ్యాయేతర సిబ్బందికి ట్రిబ్యునల్ తీర్పు అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు.

బదిలీల పంచాయితీ..!

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బదిలీల ప్రక్రియ పంచాయతీలో చర్చనీయాంశంగా మారింది. గ్రేడ్-1 పంచాయతీలకు గ్రేడ్-4, 5 కార్యదర్శులు పోటీ పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శులను గ్రేడ్‌ల ప్రకారమే బదిలీల ప్రక్రియ నిర్వహించాలని, అయిదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారిని మార్చాలని సూచించింది. ప్రభుత్వం మారడంతో కొందరు కార్యదర్శులు కీలక పంచాయతీలకు వెళ్లేందుకు పావులు కదుపుతున్నారు. గ్రేడ్-1 పంచాయతీలకు బదిలీ అయ్యేందుకు ఉన్న అస్త్రాలన్నింటిని వినియోగిస్తున్నారు. దీనిపై నేరుగా కొందరు ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులతో మాట్లాడుతుండటం గమనార్హం. గ్రేడ్‌ల వారీగా చేపడుతున్న నిబంధనలు తెలియజేయడంతో వారు ఈ ప్రక్రియకు అడ్డుపడడం లేదు. బదిలీల ప్రక్రియ పూర్తయినప్పటికీ పాత తేదీతోనే అరకొరగా జరుగుతున్నాయన్న వాదన వినిపిస్తోంది.

ఉత్తర్వులు జారీ చేసి.. నిలుపుదల: గుంటూరు డివిజన్ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగిని ఏడేళ్లుగా ఇక్కడే ఉంటున్నారని, ఆమెను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. అదే కార్యాలయంలో పని చేస్తున్న మరో ఉద్యోగి అయిదేళ్లు పూర్తయినా అక్కడే ఉండేందుకు అవకాశమున్న అన్ని అస్త్రాలను వినియోగిస్తున్నారు. అందువల్లే తొలుత మహిళా ఉద్యోగిని బదిలీ చేశారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో జిల్లా అధికారి ఆ ఉత్తర్వులను నిలుపుదల చేశారు. ఈ విషయమై ఇటీవల బాపట్ల జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి గుంటూరు డీపీవోను కలిసి మాట్లాడినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, నిబంధనలు పాటించాలని డీపీవోతో పేర్కొన్నట్లు తెలిసింది. మరికొందరు ప్రజాప్రతినిధులు కూడా డీపీవోను ఫోన్ ద్వారా సంప్రదించినట్లు సమాచారం.

☛ బదిలీల ప్రక్రియపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవిని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రేడ్‌లను కచ్చితంగా పాటిస్తున్నామన్నారు. ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రక్రియ నిర్వహించడం లేదన్నారు. డీఎల్‌పీవో కార్యాలయంలో ఉద్యోగినిని పల్నాడు జిల్లాకు బదిలీ చేసిన విషయం వాస్తవమేనని, ఆమె అనారోగ్య పరిస్థితి తెలియకపోవడంతో తొలుత బదిలీ చేశామని, ఆమె నేరుగా వచ్చి సమస్య తెలియజేయడంతో ఆపివేసినట్లు తెలిపారు.

తెదేపా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

వైకాపా నాయకుల వేధింపులే కారణం



విజయవాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరెడ్డి

తాడేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా నాయకుల వేధింపులు తట్టుకోలేక తెదేపా కార్యకర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. తాడేపల్లి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలో బుగ్గలవారిపాలేనికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, స్థానికంగా ఉన్న వైకాపా నాయకులు మధ్య వినాయక చవితి సందర్భంగా వివాదం ఏర్పడింది. దీంతో వైకాపా నాయకులు వెంకటేశ్వరరెడ్డిని గ్రామంలో బహిష్కరించారు. ఎవరూ అతడితో మాట్లాడకూడదని, అతడి కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేయవద్దని తీర్మానించారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు విషయాన్ని మంత్రి లోకేశ్‌కు వివరించేందుకు ఉండవల్లి నివాసంలో మంగళవారం ఉదయం జరిగిన 'ప్రజా దర్బార్' కార్యక్రమానికి భార్య, కుమారుడితో కలిసి వచ్చారు. వినతి ఇచ్చేందుకు క్యూలో నిలబడ్డారు. ఇంతలో ఇప్పుడే వస్తానని బయటకు వెళ్లిన వెంకటేశ్వరరెడ్డి కొద్దిసేపటి తరువాత తిరిగి వచ్చారు. గ్రామంలో జరిగిన అవమానాన్ని భరించలేక పురుగుమందు తాగానని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుమారుడు సమరసింహారెడ్డి అక్కడే ఉన్న పోలీసులకు విషయం చెప్పగా.. 108 అంబులెన్స్‌లో బాధితుడిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుమారుడు తెలిపాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు పూర్తి వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం తెలిపాయి. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లు సంప్రదించవచ్చని సూచించారు.

కొనసాగుతున్న నైపుణ్యా గణన



మంగళగిరిలో సర్వే చేస్తున్న సిబ్బంది

మంగళగిరి, తాడేపల్లి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో నైపుణ్య గణన మంగళవారం రెండో రోజు కొనసాగింది. మంగళగిరితోపాటు తుళ్లూరు మండలంలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నివేదిక ఆధారంగా పరిశ్రమలతో ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీల అనుసంధాన ప్రక్రియ, ప్రతి నెలా జాబ్ మేళాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించనున్నారు. క్షేత్రస్థాయిలో ఎంత మంది నిరుద్యోగులు ఉన్నారు? వారి వృత్తి నైపుణ్యాలు..? ఏ వయస్సు వారు ఏ ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి కోరుకుంటున్నారనే అంశాలు సిబ్బంది సేకరిస్తున్నారు. సర్వేతో తమకు మేలు చేకూరుతుందని స్థానిక యువత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు ఏపీపీసీబీ షోకాజ్ నోటీసులు

గుంటూరు(పట్టాభిపురం): పర్యావరణ అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నందుకు గుంటూరులోని గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు తీసుకున్న నవీనా బేగం గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ల సముదాయాలను ఇటీవల పరిశీలించారు. పూర్తి స్థాయిలో పర్యావరణ అనుమతులు తీసుకోకుండా 20,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తున్న భవనాలకు పర్యావరణ అనుమతులు అవసరం కాగా.. నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో అనుమతులు పొందలేదని గుర్తించారు. 2015లో ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో అనుమతులు తీసుకొని ఏలూరు జూట్ మిల్స్ లిమిటెడ్ పేరుపై మార్చుకున్నారు. 20,000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో తలపెట్టిన భవన నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన సీటీఈని ఏపీపీసీబీ నుంచి పొందలేదు. బోర్డు సమ్మతి పొందకుండానే నివాస సముదాయాలను నిర్మించడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. దీంతో షోకాజ్ నోటీసు అందించడంతో పాటు 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, అప్పటి వరకు నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశించారు.

ప్రపంచం గర్వించదగిన తత్వవేత్త సచ్చిదానంద మూర్తి



మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రపంచం గర్వించదగిన తత్వవేత్త కొత్త సచ్చిదానంద మూర్తి అని విశ్వ హిందీ పరిషత్తు జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి శత జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తత్వ, వేదాంత శాస్త్రాలు వేర్వేరని చెప్పిన వ్యక్తి సచ్చిదానంద మూర్తి అని వెల్లడించారు. విద్యార్థులు తెలుగును అమ్మ భాషగా నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్యలోని మర్మాన్ని గ్రహించారు కాబట్టే సచ్చిదానంద మూర్తి గొప్ప తత్వవేత్తగా ఎదిగారని, ప్రతి విద్యార్థి ఆయన ఆలోచనలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి సేవల వల్లనే చాలా మంది పేద విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఆయన అందరిలాగా కాకుండా తనకంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకోవడం వలనే ఆయనకు తత్వశాస్త్రంలో ప్రత్యేక స్థానం లభించిందని పేర్కొన్నారు. సచ్చిదానంద మూర్తి కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఆయనపై ప్రత్యేకంగా రచించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించారు.

తల్లి మృతదేహం లభ్యం.. దొరకని కుమార్తె ఆచూకీ

విజయవాడ: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలోని బందరు కాలువలో దూకిన వివాహిత తిరుపతి సుధారాణి మృతి చెందారు. ఆమె మృతదేహం మంగళవారం యనమలకుదురు లాకుల వద్ద దొరికింది. ఆమె కుమార్తె జాస్వి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మూడు రోజులుగా గాలిస్తున్నారు. సుధారాణి భర్త తిరుమలరావు మరో మహిళతో సన్నిహితంగా ఉండటమే దంపతుల మధ్య వివాదానికి కారణమైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆదివారం తల్లి తన ఇద్దరు కూతుళ్లతో బందరు కాలువలో దూకిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో చిన్న కుమార్తె బ్లేసి మృతి చెందింది. ఆమె మృతదేహం ఆదివారమే లభ్యమైంది. తాజాగా తల్లి మృతదేహం దొరికింది. మరో చిన్నారి ఆచూకీ తెలియాల్సి ఉంది.